ఫిబ్రవరి 2019
రూ. 20

# చైతన్యం

**సంకల్ప బలం**

## సామాజిక విలువల మాసపత్రిక















రిపబ్లిక్ డే   వేడుకలు




అమెరికా లోని డాలస్ లో 70 వ రిపబ్లిక్ డే  వేడుకలు




# చైతన్యం
సంకల్ప బలం

సామాజిక విలువల మాస పత్రిక

వ్యవస్థాపక సంపాదకురాలు
తీగవరపు శాంతి

సంపుటి -8 ఫిబ్రవరి 2019 సంచిక -5


## ఈ సంచికలో

### ధారావాహికములు:


| | |
|---|---|
| మానసరోవర యాత్ర | 6 |
| ప్రేమంటే ఇంతే | 13 |
| ముల్లా నస్రుద్దీన్ కథలు | 16 |
| కాశీ ఖండం | 23 |
| సంభాషణ సంస్కృతం | 28 |
| మా ఊరి నందుల కథ | 34 |
| ప్రహేళిక | 42 |


### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| యంతరపి అంటే ఏమిటి? | 10 |
| కోడి రామ్మూర్తి | 18 |
| ఎన్ని కలలో ఎన్ని కల్లలో | 21 |
| వానమామలై జగన్నాధాచార్యులు | 25 |
| చమత్కార వాక్కు | 32 |
| గ్రహణం పట్టిన మనిషి | 35 |
| జ్ఞానఫలం | 39 |
| సర్వ దేవతా ప్రీతికరం- మాఘ మాసం | 43 |
| రాశి ఫలాలు | 49 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

# ఎన్నికలొచ్చాయ్ ------ తాయిలాలొచ్చాయ్

ఎన్నికలొస్తున్నాయి అంటే రాజకీయ నాయకులలో ఒక విధమైన హడావిడి అయితే అధికారులలో వేరే రకమైన హడావిడి, టెన్షన్. ఇక ఓటర్లకైతే పండగే పండగ. తాయిలాలే తాయిలాలు కదా ! తెలంగాణలో ఎం ఎల్ ఏ పదవులు చేజిక్కించుకోవడం కోసం కిందా మీదా పడ్డారు రాజకీయ నాయకులు. TRS పదవి చేజిక్కించుకోవడం, అధికారం చేపట్టడం అయ్యింది. తరువాత పంచాయితీ ఎన్నికల హడావిడి. మరలా ఇక్కడ కూడా ఎన్నికలతో పాటు, ప్రజలు కూడా ఉత్సాహంగా ఉంటున్నారు తాయిలాలు అందుకోవడం కోసం, అవి అందుకునే ప్రజలు ఓట్లు వెయ్యడానికి శ్రద్ధ చూపిస్తున్నారా? లేక నిజంగా ఈ అధికారి అయితే మాకు అందుబాటులో ఉంటారు, అన్ని సౌకర్యాలు కలిగిస్తున్నారు అని ఓటు వేస్తున్నా-రా? అనే విషయము మాత్రము అర్ధం కావడంలేదు ఎవ్వరికీ. పంచాయతీల్లో కూడా టి ఆర్ ఎస్ హవానే నడుస్తోంది. అలాగే తెలంగాణా ప్రజల హడావిడి ఇలా ఉంటే, ఆంధ్ర ప్రదేశ్ లోను హడావిడి మొదల-య్యింది. అక్కడ అధికారులు కూడా పోలవరం ప్రాజెక్ట్ పనుల గురించి, వారు చేసిన అ బి వృద్ధి పనుల గురించి, చేపట్టే రక రకరకాల అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించడము, చూపించడంలోనూ బిజీ గా ఉంటున్నారు. జన్మభూమి కార్యక్రమాలు చేపట్టి, స్త్రీల కోసము శ్రీమంతం కార్యక్రమాలు, పెన్షన్ అందరికి రెట్టింపు చెయ్యడము, ఇంకా ఎక్కువ వికలాంగులు అయితే 10,000 రూపాయల వరకూ ఇవ్వడం,సెల్ ఫోన్ లు ఇవ్వడం ఇస్తున్నారు. ఇంకా చాలా చేస్తామని వాగ్దానాలు కూడా చేస్తున్నారు. వీటితో పేదవారుకూడా చాలా బిజీ అవుతున్నారు అందుకోవడములో.

అంతా బానే ఉంది కానీ ఈ ఫ్రీ గా ఇచ్చే పద్ధతి కాకుండా వారు అభివృద్ధి చెందే విధంగా ఆఖర్చు చేస్తే పన్నులు కట్టిన మా సొమ్ము వారికిస్తుంటే మాకు ఇంకా ఆనందంగా ఉంటుందికదా ! అనేది మిగిలిన ప్రజల ఆవేదన. అంతేకాదు, ఇలా పంచడం వలన వారికి ఓట్లు పడి, రాజకీయ నాయకులు అధికారా-లు చేపట్టచ్చేమో కానీ ప్రజలను సోమరిపోతులుగాను తయారు చేసిన వాళ్ళు అవుతారనే వాదన కూడా ఉంది. ప్రభుత్వం అంటే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి దేశ అభివృద్ధికి పాటుపడాలి తప్ప, ఫ్రీగా ప్రజల సొమ్మును పంచిపెట్టి, అధికారము చేజిక్కించుకోవడం ఎంత వరకూ న్యాయము అని మిగిలిన ప్రజల ఆవేదన. వారి కుటుంబాలు నాశనం కాకుండా కూడా చూడవలసిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. వైన్ షాపులు వీధి వీధికీ తెరిచి, ప్రభుత్వం డబ్బు సంపాదించాలని చూస్తే, అసలే తాగుడుకు అలవాటైన ప్రజలు , డబ్బు ఫ్రీగా చేతిలో కనపడేసరికి తాగి, తాగి, చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రాణాలు పోగొట్టు-కుంటున్న సంఘటనలు కోకొల్లలు. వీటి మీద కూడా ప్రభుత్వాలు దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎప్పుడైతే ప్రజలకు హాని జరుగుతోందని తెలిసిందో , ఎక్కడైతే ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది అని తెలిసిందో, ఎక్కడ ప్రజలు అన్యాయానికి గురౌతున్నారో జాగ్రత్తగా గమనించి తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఇక ముఖ్యంగా ప్రజలు డబ్బులు మనకి ఎందుకు ప్రభుత్వాలు ఇస్తున్నాయి? అని గ్రహించి అత్యవస-రమైతే తప్పకుండా ఉపయోగించుకోవాలి . అంతే కానీ శారీరక శక్తి ఉన్నాకూడా ప్రభుత్వాల దగ్గర తీసుకుని , ఆ సొమ్ముని వాడుకుంటూ , శ్రమపడకుండా ఉండడం కూడా మంచిది కాదు . అంతేకాదు , ఊరికే సొమ్ములు వసున్నాయి కదా ! వాళ్ళడిగింది ఒక్క ఓటే కదా ! అనుకుంటే మీ గొయ్యి మీరే తవ్వుకున్నట్టని గ్రహించండి . రాజకీయనాయకులు వచ్చినప్పుడు వారిని నిలదియ్యండి , మీకేమి కావాలో , మీకు ఇంత-వరకు ఏమి చేశారో , ఏమి చెయ్యాలో అడిగే పూర్తి హక్కు మీకుందని మీరు మరచిపోకండి .

**మీ ఓటే మీ ఆయుధం అని తెలుసుకోండి.**

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

ముక్తినాథ్ మానసరోవర యాత్ర విడియో చూసాను. విడియో నాణ్యత మొదట్లో కన్నా పోను పోను పుంజు కుంది. ఫ్లైట్స్ రద్దు అవటంతో విడియో ఆగిపోవటం బాధ అనిపించింది. ఎంత తొందరగా మానసరోవర్ కి మమ్మల్ని ఎప్పుడు తీసుకువెడతారా అని ఆత్రంగా ఉంది. మీ అనుభవాలు పాఠకులతో/ వీక్షకులతో మీరు పంచుకొనటానికి చేసిన మీ ప్రయత్నం అబినందనీ యం. మీరు ఆ పాట పూర్తిగా పాడుంటే బాగుండేదనిపిం చింది.

రావు వేమూరి, కాలిఫోర్నియా , యు. ఎస్

శాంతిగారు నమస్సులు.వీడియో ఆసాంతం మీ లలిత మధురమైన వ్యాఖ్యానంతో హృదయాన్ని అలరించింది. మీరు పొందిన ఆనందాన్ని అందరికీ పంచాలనే మీ తాపత్రయం వీడియో అంతా విస్పష్టంగా తెలుస్తుంది.ఒకరకంగా మీతోబాటుగా కారులో పడవలో ప్రయాణిస్తూ ఉన్న అనుభూతిని కలిగించారు.మీరు నారాయణతో నమో నమో అన్న ఒక్క వాక్యం ఆలపించటంలోనే మీరెంతటి చక్కని శాస్త్రీయ గాయనీమణులో తెలిసి పోయింది.మా పేర్లను కూడా మీ వ్యాఖ్యానంలో చేర్చినందుకు మనసారా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.మీ ముక్తిధామ్ యాత్ర తరువాతి వీడియోకై వేయికన్నులతో ఎదురు చూస్తుంటాము. కొసమెరుపుగా రుద్రాక్ష వృక్షాన్ని చూపి ఎంతో ఆసక్తిని రేకెత్తించారు.నమస్సులు.

తుమ్మూరి.

చూడ చక్కని విడియో. విన చక్కని వ్యాఖ్యానం. మీకు మా ధన్యవాదాలు. 'చైతన్యం సంకల్పబలం'కు, మీకు, మీ కుటుంబానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు.

వసుంధర

వేమూరి వెంకటేశ్వరరావు గారు వ్రాసిన "ష్రోడింగర్ పిల్లి 'అంటే ఏమిటో అనుకున్నాము . చాలా చక్కగా వివరించారు . అలాగే ఎంతో విజ్ఞానదాయకంగా ఉంటున్నాయి వారు వ్రాసేవి అన్నీ ." ప్రేమంటే ఇంతే " కూడా చాలా బావుంటోంది . రచయిత చాల బాగా వ్రాస్తున్నారు.

శ్రీమతి శాంత , శ్రీమతి అనురాధ , శ్రీ విశ్వేశ్వర రావు ---- సికింద్రాబాదు. శ్రీమతి అన్నపూర్ణ .. శ్రీ కామేశ్వరరావు ---- అనంతపూర్ . శ్రీమతి భాను , శ్రీ కోటేశ్వర రావు --- రావులపాలెం.

పాలెపు బుచ్చిరాజు గారు వ్రాసిన "ముల్లంగి వేదాంతం" బుద్ధిమంతుడు , తెలివైన వాడు విజ్ఞానాన్ని బయటకు తీసినట్లు అంటూ చక్కగా పోలుస్తూ వ్రాసిన కథ చాలా బావుంది . గణితమే తన లోకంగా జీవించిన "మేధావి శకుంతలా దేవి" హ్యూమన్ కంప్యూటర్ అంటూ "పోడూరి శ్రీనివాస రావు గారు" చాలా అద్భుతంగా వ్రాసారు , " వేదుల సుబ్రహ్మణ్యంగారు " వ్రాస్తున్న పద్యాలు సమయానుకూలంగా ఎన్నికల గురించి చాలా బాగా వ్రాస్తున్నారు.

శ్రీ కమల నాథ్ , శ్రీ సుబ్రహ్మణ్యం , శ్రీమతి లక్ష్మి ----విశాఖపట్నం. శ్రీ సోమ శేఖర్, శ్రీమతి లత శ్రీమతి అరుణ.

"కాశీఖండం" అద్భుతంగా మాకు ఎంతో ఇంట్రస్టుగా వ్రాస్తున్నారు "పోచినపెద్ది మురళీ కృష్ణ గారు. ' ఇక తుమ్మూరి రామ్మోహనరావు గారైతే తెలంగాణా మహానుభావులు "పండిత కవి డా. పల్లా దుర్గయ్య" గురించి చాలా బాగా వ్రాసారు. ప్రతీ నెలా అలా ఒక్కొక్కరి గురించి తీసుకుని వ్రాయడం మాకు చాలా ఆనందంగా ఉంటోంది.

శ్రీ కరుణాకర్ రావు, శ్రీ జగన్ మోహన్ రావు , శ్రీమతి సరిత ---వేములవాడ. శ్రీ సత్యన్నారాయణ , శ్రీ శోభనాద్రి, శ్రీమతి కమల --- సిద్ధి పేట. శ్రీమతి విజయ -- విజయవాడ .

"శ్రీ దుర్గా ప్రసాద్" సంస్కృతం చాలా అద్భుతంగా , వివరంగా వ్రాస్తున్నారు. తేలికగా అర్ధమయ్యే పద్ధతి లో వ్రాస్తున్నారు. అలాగే హైమవతిగారు పిల్లల కోసం ఎంతో మంచి కథలు అందిస్తున్నారు. ప్రతీ కథలోను ఏదో ఒక నీతి ఉంటుంది .

శ్రీమతి సుందరి , శ్రీమతి అపర్ణ , శ్రీ ప్రభాకర్--- హైదరాబాదు. శ్రీ వెంకట్ , శ్రీమతి అనసూయ , శ్రీమతి కవిత ---- కోదాడ.

" నందుల ఆత్మీయ కథ" బాగా నడుస్తోంది. ఎంతైనా పల్లెటూరి గురించిన కథలు మనస్సుకి హత్తుకుంటాయి. అలాగే " ఎలక్ట్రాన్ గారు" వ్రాసే ప్రతీ కథ సామాజిక ధృవపథంతో బాగా రచిస్తారు. 'భూమి సుతుడి బావగార్లు' టైటిల్ బావుంది.

శ్రీమతి కల్పవల్లి , శ్రీమతి సుజాత , శ్రీ మాధవ్ --- కాకినాడ . శ్రీ పాపా రావు , శ్రీ ప్రసాదరావు , శ్రీమతి అర్చన ---- ఏలూరు .

శ్రీ భువన చంద్ర " వ్రాసిన "వృక్ష నీతి " చాలా అద్భుతంగా ఉంది. ప్రకృతి గురించి ఎంతో గొప్పగా చెప్పారు." ప్రహేళిక" బుర్రకి పదును పెడుతోంది. ప్రయత్నిస్తున్నాము.


శ్రీమతి పూర్ణ, శ్రీ రాజశేఖర్ , శ్రీమతి పవిత్ర ----- కడప . శ్రీమతి లక్ష్మీ ప్రసన్న, శ్రీ ప్రదీప్ , శ్రీమతి శోభ.

" పౌష్య లక్ష్మి " గురించి కొత్త రామానందంగారు ఆ మాసం లో వచ్చే పంటల గురించి ఆనెల ప్రత్యేకత గురించి బాగా వివరించారు . మూడు ధాతువుల మూల రూపాలు "హృదయం " అనీ రక్తం గుండెకు చేరే విధానం గురించి శ్రీమతి చిలకమర్తి లక్ష్మి ప్రసన్న "గుండె గుప్పెడు పని గంపెడు " ప్రసన్నగారు చాలా బాగా వ్రాసారు.

లక్ష్మణరావు, సరోజ - కుకట్ పల్లి

# కల నిజమాయె -
# ముక్తినాథ్ - మానస సరోవర యాత్ర

అక్కడ నుండి ఈశ్వరుడి గుడికి వెడదాము ఇక్కడ ఫేమస్ అన్నాడు డ్రైవర్. వెళ్ళాము అది స్వయంభూ అని తరువాత ఎవరో చెప్పారు. కిందకి మెట్లు ఉన్నాయి అవి నీళ్లతో తడిగా ఉన్నాయి. మెట్ల వెంబడే గోడ మీద అందమైన భగవంతుడి శిల్పాలు ఉన్నాయి. ఒక పక్క జారుతుందేమో అనే భయం. దాంతో చూసుకుంటూ కొంతదూరం వెళ్ళాక నేను ఆగిపోయాను అసలే పెద్ద ప్రయాణం ఉంది, జారితే కష్టం అని. మా హస్బండ్ ఇంకాకొద్దీ దూరం వెళ్ళి, పెద్దగా ఏమీ అనిపించడం లేదు అని వచ్చేసారు. ఇంకా కిందకి వెడితే నీళ్ళల్లో ఈశ్వరుడు ఉన్నాడు అని



మాతో వచ్చిన ఫ్రెండ్స్ చెప్పారు వాళ్ళు ముందు రోజు మేము బారామతి గుడికి వెళ్ళినప్పుడు వెళ్లి వచ్చారుట. అక్కడితో ఊరు చూడ్డం అయిపోయింది అన్నాడు డ్రైవర్.

తరువాత మమ్మల్ని హోటల్ దగ్గర దింపాడు. రూమ్ కి వెళ్లి ఫ్రెష్ అయ్యి కిందకి డిన్నర్ చెయ్యడానికి వచ్చాము. అక్కడ డిన్నర్ సర్వ్ చేస్తున్న అమ్మాయిని అడిగాము. రేపు ముక్తినాథ్ కి విమానం వెళ్లే చేన్స్ ఉంటుందా మాకు? మాకు మానస సరోవరం ట్రిప్ కూడా ఉంది, మరీ ఆలస్యం అయితే కష్టం ఆ ప్రయాణానికి అని అడిగాము. ఏమో చెప్పలేము అలాగ. ఇక్కడకి వచ్చి నాలుగు రోజులు ఉండి, ముక్తినాథ్ వెళ్లే అవకాశం లేక వెనక్కి వెళ్ళిపోతారు. అది మీ అదృష్టాన్ని బట్టి ఉంటుంది అంది ఆ అమ్మాయి. ఆమ్మో! ఆ మరునాడు కూడా విమానం ఉంటుందో, లేదో తెలియదు. హోటల్ వాళ్ళని అడిగితె, అది అదృష్టం ఉండాలి ఎంతో మంది వస్తారు. అయ్యో హెలీకాప్టర్లో అయినా వెళ్ల వలిసిందా? పొరపాటు చేశామా అనే టెన్షన్ పడ్డాము. మా ఏజెంట్ ని అడిగితె, మీకు విమానం వెళ్ళక పోతే, నేను ఏదో ఒకటి చూస్తాను అన్నాడు. మళ్ళీ పది నిముషాల్లో ఫోన్ చేసి పొద్దున్న 5 గంటలకు




రెడీగా ఉండమన్నాడు. సరే అని, రాత్రి పడుకుని 3 గంటల కల్లా లేచి రెడీ అయ్యి, అన్నే సద్దుకుని కిందకి వచ్చేసరికి మళ్ళీ వర్షం పడుతోంది. ఏజెంట్ ఫోన్ చేసి మీరు వెయిట్ చెయ్యండి, వర్షం తగ్గితే వెడుదురు గాని అన్నాడు. మేము పైకి టెర్రస్ మీదకి వెళ్లి అన్నపూర్ణా మౌంటేన్స్ చూసి, చాలా ఆనందంగా అనిపించి కాసిని ఫోటోలు తీసుకుని, మాతో పాటు వేరే విదేశీయులు కూడా ఉంటే, అందరం కలిసి ఫోటోలు తీసుకుని, కాస్సేపు ఎంజాయ్ చేసాము. ఈ రోజు కూడా విమానాలు వెళ్లడం లేదు అన్నారు. మాకు టెన్షన్ మొదల-




య్యింది.

మానస సరోవరం వెళ్ళాలి కాబట్టి టైం చాలదు, అందుకే వాళ్ళ బాధ. ఈ లోగా లోపల నుండి ఎవరో వచ్చి వాతావరణం బావుందిట, విమానాలు వెడుతున్నాయి అన్నారు.

తరువాత అందరం ఎయిర్ పోర్ట్ కి వెళ్ళాము. విమానాలు కూడా వెళ్లే అవకాశం ఉంది అని ఎయిర్ పోర్ట్ లో హడావిడి పడుతున్నారు అంతా. సరే, మేము విమానానికి టిక్కట్టు తీసుకోలేదు కాబట్టి హెలికాఫ్టర్ వెడుతుంది, మీరు వెళ్లి టిక్కట్టు తీసుకోండి అన్నాడు డ్రైవర్. వెళ్లి అడిగేసరికి మేము నలుగురం మాత్రమే హెలికాఫ్టర్ కి. 6 గురు అయితే టిక్కట్టు కలిసి వస్తుంది. లేరు కాబట్టి ఇద్దరినీ చెరొక 50,000 రూపాయలు ఇమ్మన్నాడు. ఏజెం ట్ దగ్గర మా డబ్బులు కాక. ఆమ్మో, అంత రేటా? అని మేము రాము, అంతగా అయితే మేము ఇండియా నుండి అయినా రాగలము, మాకు వద్దు అన్నాము. దాంతో మాతో ఉన్న తమిళియన్స్ కి కంగారు మొదలయ్యి, ఆవిడ ఏడుపు స్టార్ట్ చేసింది. నేను చెప్పాను కంగారు పడకండి, భగవంతుడు తప్పక మార్గం చూపిస్తాడు అని. నిన్న ఆ టిక్కట్టు అయినా తీసుకోలేదు, పొరపాటు చేసాము అని మేమూ బాధ పడ్డం మొదలు పెట్టాము. చేసేదేమీ లేదు. లోపలకి వెళ్లి ఎక్కడైనా అవకాశము ఉందేమో కనుక్కుందాము అనుకున్నాము. నేను లోపాలకి వెళ్లి జర్నలిస్ట్ ని, మా నలుగురికి టిక్కట్లు ఇమ్మని రిక్వెస్ట్ చేసాను. ఏదీ కార్డు చూపించండి అని అన్నారు. నేను చూపించాక, నలుగురు రావాలి, వాళ్ళు నిన్న టిక్కట్టు బుక్ చేసుకున్నారు,



వాళ్ళు రాకపోతే ఇస్తాము అన్నారు. కాని తిరిగి రావడానికి రేపటికి టిక్కట్లు లేవు, ఎల్లుండి రావాలి అన్నారు. సరే అన్నాము. బయట కూర్చోండి పిలుస్తాము అన్నారు. అరగంట తరువాత వచ్చి 11 గంటలకి లాస్ట్ విమానం వుంది. అందులో వెళ్ళండి. టిక్కట్టు కొనుక్కోమని చెప్పారు. మా ఏజెంట్ కి ఫోన్ చేసి హోటల్ డీటెయిల్స్ అడిగి మా ప్రోగ్రాం చెప్పాము. మీరు వెళ్ళండి, రేపటికీ విమానం టిక్కట్లు నేను చూసి చెపుతాను అని మాకు హోటల్ డీటైల్స్ అవి మరల చెప్పాడు ఏజెంట్. పదండి విమానం బయలు దేరుతుంది అనడంతో అందరం విమానం ఎక్కడానికి బయలుదేరాము. మొత్తం మీద మమ్మల్ని ముక్తి నాద్ దేముడు కరుణించాడు అనుకుంటూ. చిన్న విమానం, 18 సీట్లు ఉన్నది. అది ఎక్కి, ఫ్రంట్ సీట్లో కూర్చున్నాము ఫోటోలు తియ్యడానికి, అన్నీ చూడడానికి బావుంటుందని. విమానం బయలుదేరడంతో అందరమూ హమ్మయ్య! అని ఆ దేముడుకి దణ్ణం పెట్టుకుంటూ ఊపిరి పీల్చుకున్నాము.

విమానం ఎక్కి కూర్చున్నాక అందరినీ బెల్ట్ పెట్టుకోమని చాకొలెట్స్ ఇచ్చింది ఎయిర్ హోస్టెస్. పైలట్ కూర్చుని స్టార్ట్ చేశాడు. పైలట్ విమానం నడుపుతుంటే అంత దగ్గరగా చూడ



డం అదే మొదలేమో బలే ఆనందంగా అనిపించింది. అలా రన్ వే మీదుగా కొండలకు దగ్గరగా వెడుతుంటే అసలు ఆ అందాలు వర్ణనాతీతం. కొండల మీద ఆకు పచ్చని కార్పెట్ పరచినట్లు ఎంతో అందంగా అలా వెడుతుంటే కన్నార్పబుద్ధి కాదు అలా అలా కొండల మధ్యలోంచి, అందాలను చూస్తూ వెడుతుంటే జాంసోమ్ ఎయిర్ పోర్ట్ రానేవచ్చింది. దిగే ముందు గాలి బాగా ఎక్కువ వేయడంతో పైలట్ ఒక రౌండ్ తిప్పి, ల్యాండ్ అయ్యాడు. మీరంతా ఈ అందాలన్నీ వీడియోలో చూడడం మాత్రం ఎట్టి పరిస్థితులలోనూ మరచిపోవద్దు. చాలా చాలా అందముగా ఉంటుంది. అక్కడ విమానం దిగిన తరువాత సామాన్లు తీసుకుని ఎయిర్ పోర్ట్ ఎదురుగానే మెజెస్టిక్ హోటల్ ఉంది మాకు ఏర్పాటు చేసింది. అక్కడికి వెళ్లి (ఆ హోటల్ సామాన్యంగా ఉంటుంది) హోటల్ లో కాఫీ తాగి, మేనేజర్ తో ముక్తినాద్ గుడికి వెళ్ళటానికి జీప్ అరేంజ్ చెయ్యమన్నాము. మేము ఆ రాత్రి కింద హోటల్ లో బదులు పైన కొండ మీద ఉంటామని చెప్పాము. అతను మాకు స్పెషల్ గా జీప్ కావాలంటే 5000 రూపాయలు రాను పోను, అలాగే అక్కడ డ్రైవర్ మీ కోసం ఉండాలంటే ఒక 1000 రూపాయలు అన్నాడు. సరే అని మేము, మాతో పాటు వచ్చిన విమల గారు వాళ్ళు అంతా కలిసి జీప్ ఎక్కి వెళ్ళాము. డ్రైవర్ అన్నాడు కదా, ఈ రోజు నీళ్లు బానే ఉన్నాయి, గండకీ నదిలో మనం వెళ్లగలము. ఒక్కొక్క రోజు అసలు వెళ్ళడానికి కుదరదు అన్నాడు. ఓహ్! పోనీలే మన అదృష్టం బానే ఉంది అనుకుని బయట చూసుకుంటూ ప్రయాణం చేస్తున్నాము. గండకీ నది రానే వచ్చింది. బాగా నీళ్లు. ఆ నీళ్లలోంచి జీప్ వెడుతోంది. అంత ఈజీగా లేదు అనిపించింది. చాలా జాగ్రత్తగా డ్రైవ్ చేసి తీసుకు వెడుతున్నాడు. ముందు వెళ్లి వెనక్కి వస్తున్న వాళ్ళు ఎక్కడనుండి వెడితే నీళ్లు తక్కువ ఉంటాయో గైడెన్స్ ఇస్తే అలాగే అతను తీసుకుని వెళ్లి కొద్దిగా బావుంది అన్న చోట మమ్మ-



అన్నపూర్ణ పర్వతం



అనుగ్రహం కోరి ధన వంతులు కూడా ఆమె కోసం పరితపిస్తూ ఉండేవారు. గండకీ కూడా అందరినీ దరిచేరనిచ్చేది కాదు. ముందువచ్చిన బేరమే ఒప్పుకునేది. ఆ రోజుకి అతనే ఆమె భర్త. రెండో మనిషికి, రెండో బేరానికి ఒప్పుకునేది కాదు. ధనం ఆశ చూపినా దరిచేరనిచ్చేది కాదు.

ల్ని దిగమని గండకీ నదికి వెళ్లి చూసి రండి. తిరుగు ప్రయాణంలో కుదరక పోవచ్చు అన్నాడు. దాంతో నది గట్టుకి వెళ్లి అంతా తిరిగాం. అక్కడ అన్నీ సాలిగ్రామాలే .

విష్ణు చిహ్నం గల శిలయే సాలిగ్రామం అంటారు. ఈ ఒక్క 'గండకీ' నది లోనే ఉంటాయి. ఎక్కడా దొరకవు. రకరకాల పరిమాణంలో ఉంటాయి. చిన్నవి, పెద్దవి అలా రక రకాల సైజుల్లో ఉంటాయి. అవి గుండ్రని రాళ్ళలా ఉండి, నోరు తెరుచుకున్న తాబేలు లాగా ఉండి, 'శ్రీ మహావిష్ణువే శేషసాయిగా' దర్శనమిస్తారంటారు. పూజలు చేస్తూ ఉంటారు.

గండకీ నదిలోనే సాలిగ్రామాలు ఉండడానికి ఒక కథ ఉంది. గండకీ నది, నదిగా మారడానికి ముందు ఒక స్త్రీ. గండకీ పేరుతోనే సాబస్త్రీ నగరంలో ఉండేది. ఆమె అందాల వేశ్య. ఆమె

ఆమె తల్లి గండకీని మార్చాలని ఎన్నో విధాలా ప్రయత్నించి, విఫలమయ్యింది. సాక్షాత్తు నారాయణుడికే గండకీని పరీక్షించాలని కోరిక పుట్టింది. ఒక రోజు ప్రొద్దుటే పరివారంతో వచ్చిన ధనవంతుడు బేరం చేసుకుని కానుకలిచ్చాడు. అలవాటుగా అతనికి స్నానం చేయించాలని దుస్తులు తీస్తే, దుర్వాసన! ఒళ్ళంతా ఈగలు ముసిరాయి. కుష్టు వ్యాధి ఉందని కూడా గ్రహించింది.

ఆమె తల్లి తిట్టి పొమ్మంటుంటే గండకీ తల్లినే తరిమేసింది. స్నానం చేయించి సంపెంగ తైలం పూసింది. గోరు వెచ్చని నీళ్లతో స్నానం చేయించి చేనేత వస్త్రాలు చుట్టింది. చక్కని భోజనం పెటింది. పుచ్చిన చేతి వ్రేళ్ళతో అతను తినలేకపోతే, పుచ్చిన చేతి వ్రేళ్ళు ఊడిపోతే, అవి పక్కన పెట్టి భోజనం తినిపించింది. అదే విస్తరిలో తానూతింది. పక్క మీదకు చేర్చింది.

(ఇంకా వుంది)



గండకీ నది

# వేమూరి వేంకటేశ్వరరావు




## ఎంట్రోపి(యంతరపి)-అంటే ఏమిటి?

ఎంట్రోపి అనేది ఒక వియుక్త ఊహనం (abstract concept). గభీమని అర్థం కాదు; గణితం లేకుండా, గుణాత్మకంగా కొంతవరకు అర్థం చేసుకోవచ్చు కానీ లోతుగా తరచి చూడాలంటే గణితం సహాయంతో పరిమాణాత్మక దృక్కోణం తప్పనిసరి!

ఇంగ్లీషు భాషలోకి ఈ మాట, సా. శ. 1865 లో, క్లేసియస్ (Classius) ప్రవేశపెట్టేడు. ఈ మాట భౌతిక శాస్త్రంలోని తాపగతి శాస్త్రం (thermodynamics) లో పుట్టినా, ఇది ఎంతో మౌలికమైన భావం కనుక ఇతర రంగాలలోకి కూడా వ్యాపించింది. కాని ఇక్కడ మనం ఇప్పుడు భౌతిక శాస్త్రపు దృష్టితో మాత్రమే మాట్లాడుకుందాం.

ఎంట్రోపి అంటే అంతర్గత పరిణామం అని రూఢ్యర్థం. అనగా, ఒక వ్యవస్థలో అంతర్గతంగా జరిగే మార్పులకి అద్దం పట్టే ఒక సూచిక. దూరాన్ని కిలోమీటర్లులో కొలుస్తాం, బరువుని కిలోగ్రాములలో కొలుస్తాం. అలాగే ఒక వ్యవస్థలో అంతర్గతంగా జరిగే మార్పులని కొలవడానికి వాడే కొలమానం పేరు "ఎంట్రోపీ" అని ఇంగ్లీషు లోను, "యంతరపి" అని తెలుగు లోనూ అంటారు.


అంతర్గతంగా జరిగే మార్పులంటే? చిన్న ఉదాహరణతో మొదలు పెడదాం. మన శరీరమే ఉంది. ఈ శరీరం ఏ స్థితి (state) లో ఉందో తెలుసుకోవాలంటే మన శరీరపు తాపోగ్రత (tempretature), రక్తపు పోటు (blood pressure), నాడి (pulse), వగైరాలు కొలుస్తాము కదా. ఈ కొలతలని బట్టి శరీరం ఆరోగ్య స్థితిలో ఉందో, రోగ స్థితిలో ఉందో తెలుస్తుంది. ఒళ్ళు వెచ్చగా ఉందనుకొండి. ఈ వెచ్చదనం స్థూలంగా కథ చెబుతుంది కానీ ఒళ్ళు వెచ్చబడడానికి అంతర్గతంగా మరేదో కారణం ఉంటుంది. అలాగే



రక్తపు పోటు ఫలానా విలువని చూపిస్తున్నాదంటే దానికి అంతర్గతంగా కొన్ని కారణాలు ఉండొచ్చు కదా. కనుక ఒక వ్యవస్థ యొక్క స్థూల స్థితి (macro state) కి అంతర్గతంగా అనేక సూక్ష్మ స్థితులు (micro states) కారణాలు కావచ్చు.

ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన విషయం ఏమిటంటే సూక్ష్మ స్థితులలో లక్షలాది మార్పులు జరుగుతున్నా స్థూల స్థితిలో మార్పులు కనిపించకపోవచ్చు. మన శరీరపు తాపోగ్రతలో మార్పు లేనంత మాత్రాన అంతర్గతంగా మార్పులు లేవనా? మరొక ఉదాహరణ. ఒక జాడీలో ఉన్న వాయువు యొక్క తాపోగ్రత, పీడనం (pressure), ఉరువు (volume), మొదలైన స్థూల లక్షణాలలో ఏమాత్రం మార్పు లేకపోయినా సరే ఆ వాయువులో ఉన్న అణువులు, బణువులు నిరంతరం కదులుతూనే ఉంటాయి, గుద్దుకుంటూనే ఉంటాయి. ఆ జాడీలో అణువులు ఎప్పుడు, ఎక్కడ ఉన్నాయో, అవి ఎంత జోరుగా ప్రయాణం చేస్తున్నాయో, ఎంత తరచుగా గుద్దుకుంటున్నాయో వర్ణించడానికి సూక్ష్మ స్థితి కావలసి ఉంటుంది. ఈ సూక్ష్మ స్థితిలో నిరంతరం మార్పు జరుగుతూ ఉన్నా, స్థూలంగా మార్పు కనబడకపోవచ్చు.

కొంచెం లోతుకి తరచి చూద్దాం. ఒక జాడీలో ఎన్ని అణువులు ఉన్నాయో మనకి నిక్కచ్చిగా తెలుసని అనుకుందాం. ఈ అణు





బొమ్మ. మూడు అణువుల స్థితిగతులు. ఎడమ పక్క: సంప్రదాయిక శాస్త్రం ప్రకారం,

కుడి పక్క: గుళిక శాస్త్రం ప్రకారం.

సమూహం పరిస్థితిని వర్ణించడానికి ఎన్ని సూక్ష్మ స్థితులు కావలసి ఉంటుంది? కనీసం ప్రతి అణువు ఎక్కడుందో (దాని స్థానం, x), ఎంత జోరుగా, ఏ దిశలో కదులుతో దో (దాని వేగం, v) తెలియాలి. స్థానం, వేగం నిజ సంఖ్యలు (real numbers) కనుక వాటి విలువలని పరిమితమైన హద్దులలో ఉంచినా అవి అనంతమైనన్ని విలువలని స్వీకరించగలవు. (They can assume infinite number of possible values even if confined within a finite limit.) కనుక వాయువులో ఉన్న అణు సమూహం పరిస్థితిని వర్ణించడానికి అనంతమైనన్ని సూక్ష్మ స్థితులు కావలసి ఉంటుంది! ఇది చిక్కులని తెచ్చిపెడుతుంది. ఉష్ణ వికిరణాన్ని అధ్యయనం చేస్తూ, ఇటువంటి పరిస్థితిలోనే చిక్కుపడి మేక్స్ ప్లేంక్ ఉష్ణ శక్తి గుళికల మాదిరి ప్రవహించాలి అంటూ గుళిక వాదానికి అంకురార్పణ చేసేడు కదా. అదే విధంగా సంప్రదాయిక భౌతిక శాస్త్రం ఇక్కడ కూడా పని చెయ్యదు; గుళిక వాదం వాడాలి! సంప్రదాయిక భౌతిక శాస్త్రానికి గుళిక వాదానికి మధ్య తేడాని చిన్న ఉదాహరణ ద్వారా చూపెడతాను. పై బొమ్మలో ఎడమ పక్క సంప్రదాయిక భౌతిక వాదం, కుడి పక్క గుళిక వాదం. ఎడమ పక్క, ఒక గదిలో, మూడు అణువులు ఉన్నాయి. ఇవి కేవలం ఒక దిశలో - అనగా పైకి, కిందికి - కదలగలవని అనుకుందాం. వాటి స్థానాలు (x), వేగాలు (v) బొమ్మలో చూపించేను. ఈ రెండు చలరాసులు అనంత-

మైనన్ని విలువలు పొందగలవు. గుళిక వాదంలో ఈ మూడింటిని బిందువులలా కాకుండా నిలకడ తరంగాలు (standing waves) గా, కుడి వైపు బొమ్మలో చూపిన-ట్లు, ఊహించుకుంటాం. మనకి ఉన్న స్థలంలో ఒకటో, రెండో, మూడో, ..., ఐదో, పదో తరంగాలు ఇముడుతాయి కదా. ఇలా మనకి ఉన్న స్థలంలో ఎన్ని తరంగాలు పడతాయో ఆ సంఖ్యని తరంగపు సంఖ్య (wave number),n, అందాం. ఈ n విలువ 1, 2, 3, ...,10,... ఇలా ఏదైనా పూర్ణ సంఖ్య కావచ్చు. .




నిజానికి అణువులు ఉన్న ప్ర-దేశానికి పొడుగు (x), వెడల్పు (y), లోతు (z) ఉంటాయి కనుక ప్రతి అణువుకి 3 దిశలలో తరంగపు సంఖ్యలు ($n_x$, $n_y$, $n_z$ ) ఉంటాయి. జాడీలో ఎన్ని అణువులు ఉన్నాయి? ప్రస్తు-తానికి N అణువులు ఉన్నాయ-ని అనుకుందాం. ప్రతి అణువు 3 దిశలలో ఊగిసలాడుతూ ఉంటుంది. ఎంత జోరుగా ఊగి-సలాడుతూ ఉంటుంది? అనగా తరంగపు సంఖ్య n ఎంతయి ఉంటుంది? ఇక్కడ లెక్క సౌల భ్యానికి n=8 అనుకుందాం. ఇప్పుడు జాడీలో $8^{3N}$ తరంగపు బాణీలు కనిపిస్తాయి. జాడీలో చాల అణువులు ఉంటాయి కదా! ప్రస్తుతానికి $N=10^{20}$ అను కుందాం. ఇప్పుడు జాడీలో ఉన్న సూక్ష్మ స్థితులు:

$$8^{3x10^{20}}$$

ఇది లెక్క కడితే చాలా పెద్ద సంఖ్య వస్తుంది.

ఉదాహరణకి గది తాపోగ్రత (300 K) వద్ద, వాతావరణపు ఒత్తిడి వద్ద ఉన్న ఒక మోలు ఆర్గాన్ వాయువులో ఎన్ని సూక్ష్మ స్థితులు (micro states) ఉన్నాయో లెక్క కడితే

$$g = 10^{4,870000,000000,000000}$$

$$= 4.87x10^{24}$$

సూక్ష్మ స్థితులు అని తేలింది. ఇది చాలా, చాలా, చాలా పెద్ద సంఖ్య - కానీ అనంతం (infinity) కాదు!

ఇంతింత పెద్ద సంఖ్యలతో వేగడం కష్టం. అందుకని దీనిని మచ్చిక చేసుకుందుకుగాను దీని స్థానంలో దీని సంవర్గమానం ( "లాగరిథమ్") విలువని ఉప-యోగిస్తాం. అప్పుడు,

$k = 1.38x10^{-23}$ Joules/KS

$= k \ln g$

వస్తుంది. ఈ S కి ఎంట్రోపి అని పేరు పెట్టేరు. నేను యంతరపి అంటున్నాను. ఈ సమీకరణం-లో $k$ అనేదానిని బోల్ట్^జ్మన్ స్థిరాంకం (Boltzmann constant) అంటారు. కనుక ఎంట్రోపి (యంతరపి) అనేది సూక్ష్మ స్థితులు ఎన్ని ఉన్నాయో సూచించే సంఖ్య. దీని కొలమానం శక్తి తాపోగ్రత.

మన ఆర్గాన్ వాయువు విషయంలో లెక్క పూర్తి చేస్తే

$S_{argon} = 1.55\ k$ Joules/K mole

వస్తుంది.

# ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



# ప్రేమంటే ఇంతే

(గత సంచిక తరువాయి)

షాజహాన్ కి తన వ్యాపారంలో నష్టాలు వచ్చినపుడు ఇబ్బందుల్లో వుండి అప్పు కోసం ప్రయత్నిస్తున్నపుడు, తన పీ.ఎఫ్ నుండి డబ్బు తీసి షాజహాన్కి ఇచ్చి ఆదుకున్నాడు కృష్ణమోహన్.

వ్యాపారంలో మళ్ళీ పుంజుకొని షాజహాన్ తన వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకొని విశాఖపట్టణంలో ప్రముఖ వ్యక్తిగా ఎదిగాడు. కృష్ణమోహన్ని కృతజ్ఞతాపూర్వకంగా తన వ్యాపారంలో కొంత వాటా ఇస్తానన్నాడు షాజహాన్.

"మన స్నేహం పది కాలాలపాటు వర్ధిల్లాలంటే నువ్వు అలాంటి పిచ్చి పనులు ఏమీ చేయకు" అని ఆ ప్రతిపాదనని సున్నితంగా తిరస్కరించాడు కృష్ణమోహన్. అలా చేయటం వల్ల షాజహాన్‌కి కృష్ణమోహనంటే ఇంకా గౌరవం పెరింగింది.

"హలో షాజహాన్ హియర్"

"అస్సలామాలేఖుం జహాపనా" అన్నాడు కృష్ణమోహన్.

"ఓహ్! ఏమి నా భాగ్యము, శ్రీ కృష్ణపరమాత్మకి ఈ భక్తుడు ఇన్నాళ్ళకి గుర్తుకొచ్చాడన్నమాట ఈ జన్మ ధన్యమైంది"

"నోర్ముయ్! యూస్‌లెస్ ఫెలో, ఇంటికొస్తే మనిషివి కనపడవు, ఫోన్ చేస్తే దొరకవు, నువ్వు కాల్ బ్యాక్ చెయ్యవు, తిరిగి నన్ను నిందిస్తున్నావు"

"సారీరా, కాకినాడలో బ్రాంచ్ మొదలుపెట్టిన తరువాత, ఈ మధ్య చాలా బిజీగా వుంటున్నాదిరా. ఏమిటి విశేషాలు? అంతా బాగున్నారా? మా బాభీ, పిల్లలు ఎలా వున్నారు?"

"అలాగా, మేమంతా కులాసా. మా బాభీ ఎలా వుంది? పాప చదువు ఎలా వుంది?"

"పాప బాగానే చదువుతున్నాది, మార్చిలో పరీక్షలకి తయారు అవుతున్నాది, మీ బాభీ ప్రస్తుతం పర్యటనలో వుంది"

"సరే, నీకొక శుభవార్త, అక్కయ్య కూతురు లావణ్యకి నిన్ననే పెళ్ళి నిశ్చయమైంది, ఈ నెల 22వ తేదీ రాత్రి ఇక్కడే పెళ్ళి అంటే ఇంక ఇరవై రోజులే వుంది, అందుకే కాస్త హడావిడిగా వున్నాము..." షాజహాన్ మధ్యలోనే ఆపి

"వండ్రఫుల్, వైదేహి అక్కయ్య కూతురు పెళ్ళా! వెరీ గుడ్ నాకు చాలా సంతోషంగా వుందిరా, అక్కకి, బావగారికి, లావణ్యకి శుభాకాంక్షలు చెప్పు" అన్నాడు.

"ఒరేయ్! నువ్వు నాకొక సహాయం చేయాలి"

"షటప్, నీకెన్నిసార్లు చెప్పాను నన్ను సహాయం అడగవద్దని, నీకేం కావాలో ఆజ్ఞాపించు అంతే"

"నా కారు రిపైర్ లో వుంది, నీకు ఇబ్బంది లేకపోతే నువ్వు ఒక కారు ఎల్లుండి నుండి స్పేర్ చెయ్యగలవా?"

"ఎల్లుండిదాకా ఎందుకు ఇప్పుడే పంపుతున్నాను, డ్రైవర్ కావాలా? ఒరేయ్! పెళ్ళి హఠాత్తుగా కుదిరినట్లుంది, డబ్బు సంగతి ఏమిటి? మొహమాట పడవద్దు, ఎంత కావాలన్నా చెప్పు, నో ప్రోబ్లం, ఓకే"

"అలాగేలేరా, అవసరమైతే అడుగుతానులే, నిన్ను గాక ఇంకెవరిని అడుగుతాను.... డ్రైవర్ అఖ్ఖర్లేదు, కారు పెళ్ళి కార్యక్రమం పూర్తయ్యేదాకా వుంచుతాను"

"శాశ్వతంగా వుంచుకున్నా నాకేమీ అభ్యంతరము లేదు"

"ఓకే, ఇక వుంటాను, థాంక్యూ వెరీ మచ్ రా"

"స్నేహితుల మధ్య లాంఛనాలు వుండకూడదని చెప్తావు, మళ్ళీ ఈ థాంక్స్ ఏమిటిరా? అరగంటలో కారు నీ దగ్గర వుంటుంది, ఇంతకీ ఎక్కడికి పంపను?"

"అక్కయ్యా వాళ్ళింటికి పంపు, ఓకే వుంటాను"

అరగంట తరువాత డ్రైవర్ వచ్చి "మోహన్ సార్ ఇదిగో కారు తాళం చెవులు, టేంక్ నింపమన్నారు, నింపాను. మీరు ఫోన్ చేసి కారు వచ్చిందని మా సార్ కి చెప్పండి సార్" అని వెళ్ళిపోయాడు.

"వీడితో ఇదే సమస్య, టేంక్ నింపి పంపాడు" అనుకున్నాడు కృష్ణమోహన్.

కాస్సేపు విశ్రాంతి తీసుకొని సాయంత్రం కాఫీలు తాగి, శుభలేఖలు పంపవలసిన రెండు జాబితాలు, ఒకటి పై వూళ్ళకి పంపేది, రెండవది స్థానికంగా ఇవ్వవలసినవి తయారు చేసారు. దాన్ని ఒకటికి రెండుసార్లు పరీక్షించి, మార్పులు, చేర్పులు చేసారు. బయట వూళ్ళకి పంపే జాబితా సత్యనారాయణకి ఇచ్చారు,స్థానిక జాబితా కృష్ణమోహన్‌కి ఇచ్చారు. తనదగ్గర వున్న జాబితాని పరిశీలిస్తూ వుండగా, ఒక పేరు దగ్గర కృష్ణమోహన్ దృష్టి నిలిచింది...

"బావగారూ, ఈ రాజేశ్వరరావు ఎవరు? మీ కొలీగా, నాకు పరిచయం లేదు మీరు పిలుస్తారా?" అని అడిగాడు.

"మా పిన్ని గారి అబ్బాయి, రాజేశ్వరరావు మరచిపోయావా... కవిత, రాజు గుర్తొచ్చారా? రెండు నెలల క్రిందట ఈ వూరు బదిలీ అయి వచ్చాడు"

"ఓహ్! రాజానా, గుర్తుకొచ్చింది" అని కాస్త ఇబ్బందిగా అన్నాడు, వెంటనే విషయం మార్చి "కారు ఇక్కడే వుంచుతాను, పని వున్నపుడు నాకు గాని, చంద్రానికి గాని ఫోన్ చెయ్యండి వస్తాము"...కృష్ణమోహన్ కావాలనే టాపిక్ మార్చాడని సత్యనారాయణకి అర్ధమయింది.

"బావగారు డబ్బు సంగతి ఏమిటి? డబ్బు అవసరమైతే చెప్పండి, మేము ముగ్గురం ఏర్పాటు చేస్తాము" హఠాత్తుగా గుర్తు వచ్చి అడిగాడు చంద్రం.

"మీరేమీ కలత చెందవద్దు, పెళ్ళికి కావలసిన డబ్బంతా నా దగ్గర సిద్ధంగా వుంది, దాని గురించి ఆలోచించవలసిన అవసరం లేదు" అన్నాడు సత్యనారాయణ.

రాత్రి భోజనాలు అయిన తరువాత ఎవరింటికి వాళ్ళు వెళ్ళారు. ఇంటికి వెళ్ళిన తరువాత తన స్నేహితుడు అవినాశ్‌కి ఫోన్ చేసి లావణ్యకి పెళ్ళి నిశ్చయము అయిందని చెప్పాడు కృష్ణమోహన్.

"చాలా సంతోషం బావా, ముహూర్తం ఎప్పుడు?" అడిగాడు అవినాశ్.

"నవంబర్ 22వ తేదీన" అని వివరాలు చెప్పాడు కృష్ణమోహన్.

మర్నాడు సాయంత్రం మాధవి, ఆమె భర్త వచ్చి వారి పాప మొదటి సంవత్సరం పుట్టినరోజుకి రమ్మని పిలిచారు. మాధవి వెళ్ళిన తరువాత ఆ భగవంతుడు ఇలాంటి ఒక ఆడపడుచుని తనకు ఇచ్చివుంటే ఎంత బాగుండేది అని ఆలోచిస్తున్నాడు కృష్ణమోహన్. అతని మనసెరిగిన రుక్మిణి "హలో సార్ అది భగవంతుని సంకల్పం, మనకున్న దానితో మనము తృప్తి చెందాలి" అని అతను ఎప్పుడూ అనే మాటలనే గుర్తు చేసింది.

***********

తొమ్మిదవతేదీభోజనవిరామము తరువాత ముఖర్జీగారు తన ఆఫీస్‌కి రమ్మని ఇంటర్‌కాంలో కృష్ణమోహన్‌ని పిలిచారు. "ప్లీజ్ సిట్ డవున్ మిస్టర్ మోహన్. మీ రిలీవింగ్ డేట్ గురించి ఏమిటి ఆలోచించారు" అని అడిగారు.

ముఖర్జీగారికి తన అక్కయ్య కూతురు పెళ్ళి గురించి, మిగతా పనుల గురించి వివరించి "సార్ నేను డిశంబర్ 10వ తేదీ కల్లా ఫ్రీ అవుతాను. కానీ అప్పటికి సంక్రాంతి పండుగ ఇక నెల రోజులే వుంటుంది, అందువలన పొంగల్ తరువాత నన్ను రిలీవ్ చేస్తే సౌలభ్యంగా వుంటుంది" అని అభ్యర్ధించాడు కృష్ణమోహన్.

"నిన్న రాత్రి డి.జి గారు మళ్ళీ కాల్ చేసారు మిమ్మల్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా రిలీవ్ చెయ్యమన్నారు. సో మేక్ ఇట్ డిశంబర్ టెంత్. జనవరి 11, 12 తేదీలలో ఇక్కడ రష్యన్స్‌తో సమావేశాలకి మీరు ఎలాగో రావాలి గనుక పొంగల్ ఇక్కడ స్పెండ్ చేద్దురుగాని, ఏమంటారు?"

ఇక ఎక్కువ సాగతియ్యడం బాగుండదని "ఓకే సర్" అన్నాడు కృష్ణమోహన్. "రిలీవ్ అవడానికి సరిగ్గా ఒక నెల వుంది, లావణ్య పెళ్ళి తరువాత సుమారు 15 రోజులువుంటుంది,పనులన్నీఒక పద్ధతి ప్రకారం పూర్తి చెయ్యాలి" అనుకొన్నాడు కృష్ణమోహన్.

తన గదికి వచ్చిన వెంటనే ఇంటికి ఫోన్ చేసాడు. "రుక్కూ నన్ను డిశెంబర్ 10వ తేదీన రిలీవ్

చేస్తున్నారు”
“ఓహ్ మై గాడ్! డిసైడ్ అయిపో యిందన్నమాట.ఎలాగండీ!ఆరు నెలలు మిమ్మల్ని విడిచి దూరం గా నేనుండలేను”
“అయితే నాతో వచ్చెయ్యి”
“వంశీ సంగతి ఏమిటి? అసలే ఫైనల్ ఇయర్, ఒక్క ఆరు నెలలు వాయిదాకి ఒప్పుకునుంటే బాగుండేది”.
“అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కుదరదు మేం సాబ్ ఏదో ఒకటే కోరుకోవాలి, సరేలే రాత్రి మాట్లాడుదాము” అని ఫోన్ పెట్టే సాడు కృష్ణమోహన్.
రాత్రి ముమ్మడివరంలో వున్న తన తండ్రికి ఫోన్ చేసింది రుక్మిణి...” నాన్నగారు, బాగున్నారా? అమ్మకెలా వుంది? మీ అల్లుడు డిశంబర్ పదవ తేదీన ఇక్కడ రిలీవ్ అవుతున్నారు, అందుకని ఆయన ఇక్కడ బయలుదేరడానికి,బొంబాయిలో రిపోర్ట్ చెయ్యడానికి ముహూర్తం పెట్టి ఫోన్ చెయ్యండి. అమ్మకి ఫోన్ ఇవ్వండి” అంది.
“ఏం అమ్మా ఎలా వుంది ఆరోగ్యం? జ్వరం ఇంకా వస్తున్నాదా?”
“లేదమ్మా బాగానే వుంది, జ్వరం రావడం లేదు” ఆవిడ గొంతు చాలా నీరసంగా వుంది. తల్లికి జబ్బు చేసినప్పుడు తనకీ ఆరోగ్యం సరిలేక పోవడం వలన తల్లికి సేవ చేయలేకపోయానని రుక్మిణి బాధ పడుతూ వుంటుంది. నెల్లాళ్ళబట్టి ముమ్మడివరం వెళదామంటే అవటం లేదు, తల్లి గొంతు వినగానే తల్లి తన భాధని దాచుతున్నాదని భావించి ఏడుపు ఆపుకోలేక ఫోన్లోనే ఏడవడం మొదలుపెట్టింది రుక్మిణి.
“ఏయ్ రుక్కూ, మతి పోయిందా, ఆవిడకి ధైర్యం చెప్పడం మానేసి, నువ్వు ఏడిస్తే ఆవిడ మరింత బెదిరిపోతారు” అన్నాడు కృష్ణమోహన్.
“రుక్మిణీ ఏడవకమ్మా, నేను బాగానే వున్నాను, నీ ఆరోగ్యం ఎలా వుంది? మోహన్ బొంబాయి ఎప్పుడు వెళతాడు? అతను బొంబాయి వెళ్ళే లోపల మీరు ఒకసారి ఇక్కడకి తప్పకుండా రండి. నిన్ను చూడాలని వుంది”
“తప్పకుండా వస్తాము,
ఆయన
డిశంబర్ పదవ తేదీ తరువాత బొంబాయి వెళతారు. నాన్నగారిని ముహూర్తం పెట్టమన్నాను. మా ఆడపడుచు కూతురు పెళ్లి తరువాత మేము ముమ్మడివరం వస్తాము. నీ ఆరోగ్యం జాగ్రత్త. నీకు అవసరం వచ్చినపుడు నేను నేను వచ్చి సాయం చేయలేకపోతున్నాను” అంటూ మళ్ళీ బాధ పడింది.



రుక్మిణి అవస్థ చూసి అత్తగారు ఇంకా వేదనకి గురి అవుతారని కృష్ణమోహన్ ఫోన్ తీసుకొని, “అత్తయ్యగారు కులాసాగా వున్నారా? నేను బొంబాయి వెళ్ళే లోపల మేము ముమ్మడివరం వస్తాము, దిగులు పడకండి. మీ ఆరోగ్యం జాగ్రత్త” అని ఫోన్ పెట్టేసాడు.
భోజనాలు పూర్తయిన తరువాత కృష్ణమోహన్ వైదేహికి ఫోన్ చేసి “అక్కా, అమ్మకి ఫోన్ ఇయ్యి మాట్లాడతాను.అమ్మా, నన్ను మా ఆఫీస్ వాళ్ళు డిశంబర్ 10 న రిలీవ్ చేస్తున్నారు. మామయ్యగారితో ఇప్పుడే రుక్మిణి మాట్లాడింది డిశంబర్ 12 న బయలుదేరడానికి, 14న బొంబాయిలో జాయిన్ అవడానికి బాగుందన్నారు” అని చెప్పాడు.
“అది కాదురా కృష్ణా వచ్చే సంవత్సరం వరకు వుండడానికి అవదా? వంశీ చదువు గురించి చెప్పలేకపోయావా?” అన్నారు సుబ్బలక్ష్మి గారు. ఆవిడ గొంతులో బెంగ స్పష్టంగా అర్ధమయ్యింది కృష్ణమోహన్‌కి.
“అవకాశం లేదమ్మా ప్రయత్నం చేసాను, కానీ ఫలితం లేదు. ఇప్పటికే ఆరు నెలలు వాయిదా వేయించగలిగాను, ఇక వెళ్ళక తప్పదు”
“పోనీ సంక్రాంతి వెళ్ళాక వెళ్ళకూడదూ?”
“సంక్రాంతికి వస్తాను ఇక్కడ ఆఫీస్ పని వుంది, రేపు కలిసినపుడు వివరంగా మాట్లాడుదాము. ఉంటాను”

(ఇంకా వుంది)

పాలెపు బుచ్చిరాజు



# ముల్లా నస్రుద్దీన్ కథలు - 9

## ఖరీదైన తలపాగా

ముల్లా నస్రుద్దీన్ భారత దేశంలో తిరిగే రోజుల్లో వింతలు విశేషాలు తెలుసుకోవడమే కాకుండా, తన దేశంలో ఎప్పుడూ కనీ, వినీ ఎరుగని వస్తువులు, బంగారు నగలు, పట్టుతో నేసిన బట్టలు, సువాసన ద్రవ్యాలు, మనుష్యులు కట్టుకునే రకరకాల బట్టలు ఇంకా ఎన్నో వస్తువులు కొని తనతో తీసుకుని వెళ్ళాడు. టర్కీ చేరుకోగానే వాటిని ఎక్కువ ధరకి అమ్ముకుని బాగా డబ్బు సంపాదించ సాగాడు. దేశాటనం చేయడం వల్ల ఇదొక అదనపు లాభం అని అతని ఉద్దేశం. డబ్బు గల వాడినే లోకం గుర్తిస్తుందన్న కిటుకు తెలిసిన వాడు నస్రు.

నస్రు తెచ్చిన వస్తువులు ఎందరినో ఆకర్షించాయి. 'నేనంటే నేనని' వాటికోసం ఎగబడసాగారు. సామాన్య ప్రజానీకం చిన్నా చితకా సామాను కొనుక్కున్నారు. ధనవంతులు పట్టు బట్టలు, బంగారు నగలు వంటివి కొనుక్కున్నారు. అతను తెచ్చిన సామాను అంతా సుమారుగా ఒక నెల రోజుల్లో అమ్ముడు పోయింది. ఆఖరికి తళతళా మెరుస్తున్న చమ్కితో కుట్టి అలంకరించబడిన ఒక తలపాగా మిగిలిపోయింది. అది చూడడానికి చాలా అందంగా ఉంది. ఎందరో



కొనుక్కుందామని ఉబలాట పడ్డారు. కాని నస్రు ఎక్కువ ఖరీదు చెప్పడంతో వెనక్కి తగ్గి పోయారు.

ఆ తలపాగాని రాజుగారు తప్ప మరెవరూ కొనలేరని అందరూ అనుకునేవారు. ఆ ఊహ నస్రుకి నచ్చింది. ఒకనాడు అదను చూసుకుని నస్రు ఆ తలపాగాని రాజుగారి ముందు పెట్టాడు. సభలో ఉన్నవారంతా దాని అందానికి అబ్బుర పడ్డారు. దాన్ని చూస్తూనే రాజావారు కూడా ముచ్చట పడ్డారు. ఆయనకది చాలా నచ్చింది. ఎలాగైనా ఆ తలపాగా తన స్వంతం చేసుకోవాలని అనిపించిందాయనకి. "నస్రు! నువ్వు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి దీన్ని ఆ దేశం నుంచి ఈ దేశానికి తీసుకు వచ్చావు. అంతే కాక దీనికి చాలా వెల ఇచ్చి కూడా ఉంటావు. అందువల్ల నేను దీనిని ఉచితంగా తీసుకోవడం భావ్యం కాదు. నువ్వు ఎంతకు కొన్నావో చెప్పుతే, మరికొంత లాభం అదనంగా ఇచ్చి నేను కొంటాను. దీని ధర ఎంతో చెప్పు." అని అడిగారు.

"సుల్తాన్ సాహెబ్! నేను ఈ తలపాగాని వెయ్యి బంగారు నాణాలు ఇచ్చి కొన్నాను. ఆ పైన మీ దయ, నా ప్రాప్తం." అన్నాడు చేతులు నులుపుకుంటూ.

సభలో పెద్ద కలకలం బయలుదేరింది. అంత పెద్ద ఖరీదు చేసే వస్తువుని అక్కడి వారెవరూ కన లేదు విన లేదు. నస్రు దురాశతో దాని వెలని ఎక్కువ చేసి చెప్పుతున్నాడని, రాజుగారిని మోసం

చేస్తున్నాడని అందరూ అనుకో-సాగారు. రాజాస్థానంలో విదూష-కుడికి మొదట్నుంచీ నస్రు అంటే అసూయగా ఉంది. సమయం దొరికినప్పుడల్లా అతని మీద దెబ్బతీయడానికి వెనుకాడ-డు. అక్కడే ఉన్న అతను, అదే ఆదనని రాజుగారికి దగ్గరగా వెళ్లి, " మహారాజా! వీడు దొంగ సన్యాసి. ప్రపంచంలో ఎక్కడా ఒక తలపాగా అంత ఖరీదు చేయదు. ఏ పది కాసులకో కొని ఉంటాడు. ఎంత అడిగినా మీరు కాదనరని, అలా చెప్పుతున్నాడు. వీడిని నమ్మకండి." అని చెవిలో ఊదాడు.

సుల్తాను వారికి కూడా నస్రు చెప్పింది నమ్మబుద్ధి కాలేదు. కాని అతని నిజాయితీ మీద నమ్మకం ఉంది. అందు వల్ల అతనినుద్దేశించి ఇలా అన్నారు. " ముల్లా గారూ! మీరు చెప్పు-తున్నది ఆశ్చర్యకరంగా ఉంది. ఒక మామూలు తలపాగా అంత ఖరీదు చేయడం నేను ఎప్పుడూ వినలేదు. మీరు నాతో పరాచి-కాలు మాని అసలు ధర ఎంతో చెప్పండి."

అప్పుడు నస్రుద్దీన్ వి-నమ్రంగా చేతులు జోడించి, " మహారాజా! నేను మీ గులామును. మిమ్మల్ని దగా చేసేటంత సాహసం చెయ్య లేను. నా మాట నమ్మండి. ఇది మామూలు అల్లా టప్పా తలపాగా కాదు. భారత దేశంలో చక్రవర్తులు ధరించే శి-రోభూషణం ఇది. దీనిని ధరించిన రాజులు మూడు తరాలవారు ఏకచ్ఛత్రాధిపత్యంగా రాజ్యాలు పాలించారు. భారత దేశం హస్త కళలకు ప్రసిద్ధి. అత్యంత నిపు-ణులైన కళా కారులు అహోరా-త్రాలు శ్రమించి దీనిని తయారు చేశారు. ఇటువంటి అపురూ-పమైన కళాఖండం మీ శిరస్సు మీద ఉంటేనే రాణిస్తుంది. అందు కోసమే నేను ప్రత్యేకంగా ఎక్కువ ధర ఇచ్చి కొని తీసుకు వచ్చాను. " అన్నాడు.

అది విని పొంగి పోయిన రాజావారు మారు మాట్లాడకుం-డా రెట్టింపు ధరని నస్రుద్దీన్ కి చెల్లించి ఆ తలపాగాని వశం చే-సుకున్నారు.

సభ పూర్తి అయ్యాక ఎవరి దారిన వారు వెళ్లి పోయారు. దారిలో నస్రుద్దీన్ విదూషకుడిని అడ్డ-గించి అతనితో ఇలా అన్నాడు. " అయ్యా! రాజా, మహారాజుల బలహీనతలు నాకు తెలిసినట్టు-గా తమకు తెలియవు. నా గుట్టు రట్టు చేద్దామని తలపెట్టడం మీకు తగదు. ఇకనైనా మీ ఆటలు కట్టిపెట్టండి. 'చెరపకురా చెడేవు'. అన్న సామెత విన్నారు కదా!" అని గడ్డి పెట్టాడు.

ఆయన తలవంచుకుని ప్రక్కదా-రిన వెళ్ళిపోయాడు.


## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంప వలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు



చైతన్యం సంకల్ప బలం

## చందా రేట్లు

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 20.00 |
| సంవత్సరానికి | రూ. 200.00 |
| పోస్ట్ ద్వారా | రూ. 230.00 |

Please deposit your subscription in favour of
**CHAITANYAM SANKALPABALAM**
**A/c No. 1626201002070 - Canara Bank**
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:
**చైతన్యం**
సామాజిక విలువల మాస పత్రిక
ప్లాట్ నంబర్ 45058
జనప్రియ ఉటోపియా
హైదర్ గూడ , అత్తాపూర్
హైదరాబాద్ - 500 048
**Email: teega51@gmail.com**
**Visit: www.chaitanyam.net**

# పోడూరి శ్రీనివాసరావు



# శ్రీ కోడి రామ్మూర్తి

ఆంధ్రరాష్ట్రానికి చెందినా ప్రముఖ వస్తాదు మరియు మల్ల యోధునిగా పేరుగాంచిన శ్రీ కోడి రామ్మూర్తి నాయుడు గారు శ్రీకా-కుళం జిల్లా వీరఘట్టం గ్రామానికి చెందినవారు.

భారత ఇతిహాసాల్లో భీముడెంత బలవంతుడో, పా-శ్చాత్య కథనాల్లో హెర్కులెస్ ఎంత గొప్ప బలవంతుడో కోడి రామ్మూర్తిగారు అంత ప్రఖ్యాతి గాంచినవారు. భీముడి గురించి గాని, హెర్కులెస్ గురించి గాని వినడమే గాని, ఎవరూ ప్రత్య-క్షంగా చూసినవాళ్ళు లేరు. కానీ, కోడి రామ్మూర్తిగారిని ప్రత్యక్షంగా చూసినవాళ్ళు, వారి బలపరాక్ర-మాలను దర్శించినవాళ్ళు, పరీ-క్షించినవారు కోకొల్లలు.

ఇరవయ్యో శతాబ్దపు తొలి దశ-కాల్లో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తెలుగువారిలో అగ్రగణ్యులు శ్రీ కోడి రామ్మూర్తిగారు. ఈయన శ్రీకాకుళం జిల్లాలోని వీరఘట్టం గ్రామంలో 1882 లో జన్మించారు.

తెలుగుదేశంలో ప్రఖ్యాత తెలుగు వీర యోధ వంశాలలో కోడివారి వంశం ఒకటి. ఈ వంశ పరంపరలోని శ్రీ కోడి వెంకయ్య నాయుడు, రామ్మూర్తిగారి తండ్రి.

చిన్నతనంలోనే తల్లిని కోల్పో-వడంతో, తండ్రిగారి ఆదేశాల మేరకు, విజయనగరంలో గల పినతండ్రి శ్రీ కోడి నారాయణస్వా-మి గారి వద్ద పెరిగారు. అక్కడ గల ఒక వ్యాయామశాలలో చేరి, దేహ దారుఢ్యాన్ని పెంచుకో-వడంతో పాటు మల్లయుద్ధం (కుస్తీ) కూడా నేర్చుకున్నారు.



21 సంవత్సరాల వయసు-లోనే, ఇతడు ఛాతీపై ఒకటిన్నర టన్నుల భారాన్ని మోయగలిగేవా-డు. తరువాత, కృషితో, 3 టన్నుల భారాన్ని కూడా మోయగలిగాడు. మద్రాసులో సైదాపేట కాలేజిలో ఒక సంవత్సరం పాటు వ్యాయా-మశాలలో శిక్షణ తీసుకుని వి-జయనగరానికి తిరిగి వచ్చి, వి-జయనగరంలో తాను చదివిన హైస్కూలు లోనే వ్యాయామ శిక్ష-కుడిగా పనిచేశారు.


విజయనగరంలో పొట్టిపం-తులు అనే మిత్రుని సహకారంతో ఒక సర్కస్ కంపెనీ నెలకొల్పాడు శ్రీ కోడి రామ్మూర్తిగారు. వారికి తుని మహారాజా వారి నుంచి సంపూర్ణ సహకారం లభించింది. రామ్మూర్తి సర్కస్ కంపెనీ పలు-చోట్ల ప్రదర్శనలిచ్చి మంచి పేరు సంపాదించుకుంది.

తెలుగు జిల్లాలలో ప్రదర్శ-నల తర్వాత, 1912 లో మద్రాస్ చేరాడు. పులులు, ఏనుగులు,

గుర్రాలు, చైనా - జపాన్ కళాకారుల సహకారం శ్రీ రామ్మూర్తి నాయుడికి లభించింది. ఆయన ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. శరీరమునకు కట్టిన ఉక్కు గొలుసును, ఊపిరితిత్తులలో గాలి పూరించుకుని, ముక్కలుగా తెంచేసేవారు. రెండు కార్లను, రెండు భుజాలకు ఇనుప గొలుసులతో కట్టించుకునేవాడు, కార్లను శరవేగంతో నడపమనేవాడు. కార్లు అంగుళం కూడా కదలలేకపోయేవి.

ఛాతీపై పెద్ద ఏనుగును ఎక్కించుకునేవాడు. 5 నిముషాలు, రొమ్ముపై ఏనుగును అలాగే ఉంచుకునేవాడు. తండోపతండాలుగా ప్రజలు రామ్మూర్తి ప్రదర్శనలు తిలకించేవారు.

సర్కస్ లోని కోడి రామ్మూర్తి క్రీడలు, విన్యాసాలు జగద్విఖ్యాతి కాంచాయి. అప్పటి వైస్రాయ్ లార్డ్ మింటో రామ్మూర్తిగారి ప్రదర్శనలను చూడాలని వచ్చాడు. రామ్మూర్తి ఆ సమయంలో ఆంజనేయ ఉపాసనలో ఉన్నందున పది నిముషాలు వేచిచూసాడు. రామ్మూర్తి ప్రదర్శనలను చూచి ముగ్ధుడయ్యాడు. తానే పరీక్షించాలనుకుని, తన కారుని ఆపవలసిందిగా కోరాడు. రామ్మూర్తిగారు తాళ్ళతో కారును తన భుజాలకు కట్టుకున్నాడు. కారులో కూర్చుని కారుని నడపసాగాడు. లార్డ్ మింటో ఎంత




ప్రయత్నించినా కారు ఒక్క సెంటిమీటరు కూడా కదలలేకపోయింది. ఈ సంఘటనతో వైస్రాయ్ ప్రశంసలను, దేశమంతటా గొప్పపేరును సంపాదించారు రామ్మూర్తినాయుడు.

పూనాలో లోకమాన్య బాలగంగాధర తిలక్ గారి కోరిక మేరకు ప్రదర్శనలనిచ్చాడు. తిలక్ రామ్మూర్తిగారికి మల్ల మార్తాండ, మల్లరాజతిలక్ బిరుదులను ప్రసాదించారు. విదేశాలలో భారత ప్రతిభను ప్రదర్శించమని రామ్మూర్తిగారిని ప్రోత్సహించారు శ్రీ తిలక్.

హైదరాబాదులో ఆంధ్ర భాషా నిలయం పెద్దలు ఘనసత్కారం చేసి, జగదేకవీర బిరుదు' ను ప్రసాదించారు.

అలహాబాదులో అఖిల భారత కాంగ్రెస్ సభ జరిగింది. రామమూర్తి సర్కస్ అక్కడ ప్రదర్శనలినిచ్చింది. జాతీయ నాయకులెందరో ఆ ప్రదర్శన తిలకించి ఆనందించారు. పండిత మదన్ మోహన్ మాలవీయా ఎంతగానో మెచ్చుకున్నారు. విదేశాల్లో ప్రదర్శనలనిమ్మని, భారతదేశ కీర్తి ప్రతిష్టలను నలు దెసలా చాటమనీ చెప్పారు.

సర్కస్ కంపెనీ బాగా పెరిగింది. రామమూర్తిగారు 1600 మంది గల తన బృందంతో లండన్ వెళ్లి ప్రదర్శనలనిచ్చారు. సుప్రసిద్ధ మల్లుడైన గామా పహిల్వాన్ తమ్ముడు ఇమామ్ బక్షీ ఆ బృందంలో ఉండేవాడు.

లండన్ లో రాజదంపతులు, జార్జ్ రాజు, రాణి మేరీ, రామ్మూర్తిగారి ప్రదర్శనలను చూసి ముగ్ధులయ్యారు. రామ్మూర్తిగారిని తమ బకింగ్ హామ్ రాజభవనానికి ఆహ్వానించి, విందు ఇచ్చిన తరువాత 'ఇండియన్ హెర్కులెస్' బిరుదుతో సత్కరించారు. ఈ విధంగా బ్రిటిష్ రాజదంపతులచే గౌరవింపబడిన భారతీయులలో మొదటివాడు కోడి రామ్మూర్తినాయుడుగారు. రామ్మూర్తిగారు ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్ దేశాలలో

ప్రదర్శనలనిచ్చారు.

స్పెయిన్ దేశంలో బుల్ ఫైట్ చాలా ప్రసిద్ధమైనది. ఆ పోరాటం చాలా భీకరంగా ఉంటుంది. రామ్మూర్తిగారిని ఆ పోరులో పాల్గొనమన్నారు. అట్టి పోరాటంలో ఎలాంటి అనుభవం లేకున్నా, రామ్మూర్తిగారు సరేనన్నారు. రామ్మూర్తిగారు రంగంలోకి దూకారు. దూసుకు వస్తున్న కోడె కొమ్ములను పట్టుకుని క్షణాల్లో క్రింద పడేశారు. కోడె చిత్తుగా పడిపోయింది. వేలాది ప్రేక్షకుల హర్షధ్వానాలతో స్టేడియం మార్మోగిపోయింది.

జపాన్, చైనా, బర్మా దేశాలలో రామ్మూర్తిగారి ప్రదర్శనలు ఎంతో వైభవంగా సాగాయి.

బర్మాలో ఉన్నపుడు రంగూన్ లో ప్రదర్శనలనిచ్చారు. అసూయాపరులు కొందరు రామ్మూర్తిగారిని చంపాలనుకొన్నారు. ఎలాగో ఆ విషయాన్ని గ్రహించిన రామ్మూర్తిగారు ప్రదర్శనను ఆపి, మరుసటిరోజే మాతృదేశం వచ్చేశారు. రామ్మూర్తిగారు కోట్లు గడించారు. అంతకంటే గొప్పగా దానధర్మాలకు, జాతీయోద్యమాలకు ఖర్చు చేసారు.

భారతదేశం అంతటా రామ్మూర్తిగారి పేరు ప్రతిధ్వనించింది. ఆయన అమెరికా వేల్లాలనుకున్నారు కానీ వెళ్ళలేదు. ప్రతిరోజూ పత్రికల్లో రామ్మూర్తిగారి ప్రశంసలు ఉండేవి. రామ్మూర్తిగారు పండిత మదనమోహన్ మాలవీయా గారి అతిథిగా ఏడాది పాటు బెనారస్ లో ఉన్నారు. ఆయన పూర్తీ శాకాహారి. భారతదేశంలో అతి విశిష్టమైన వ్యాయామ విద్యాసంస్థను ప్రారంభించాలనుకున్నారు, కానీ ఆ ప్రయత్నం ఫలించలేదు.

కీ.శే. మేడేపల్లి వరాహ నరసింహస్వామి గారు రచించినదాన్ని బట్టి, రామ్మూర్తిగారి కాలిపై రాచపుండు రావడంతో కాలు తీసివేయవలసి వచ్చింది. సేకరించిన దానం కరిగిపోయింది. శాస్త్ర చికిత్స జరిగినపుడు, ఎటువంటి మత్తుమందు(క్లోరోఫాం) తీసుకోలేదు. ప్రాణాయామం చేసి నిబ్బరంగా ఉండిపోయారు.

చివరి రోజులు బలంగీర్, పాట్నాలో కల వాండి (ఒరిస్సా) పరగణా ప్రభువు పోషణలో ఉంది 16.1.1942 తేదీన కన్నుమూసారు. తెలుగువారే కాక, భారతదేశ ప్రజలందరూ గర్వించదగ్గ మహనీయుడు, దేశభక్తుడు 'కలియుగ భీమ' కోడి రామ్మూర్తినాయుడుగారు.

వరవిక్రయం, మధుసేవ వంటి గొప్ప సాంఘిక నాటకాలు రచించిన విఖ్యాత నాటకకర్త శ్రీ కాళ్ళకూరి నారాయణరావు గారు, కోడి రామ్మూర్తిగారికి ఆప్తమిత్రులు. నాయుడిగారిని ప్రశంసిస్తూ....' సాధుపథవర్తి, సన్మిత్ర చక్రవర్తి, రమ్యతరకీర్తి శ్రీ కోడి రామ్మూర్తి' అన్నారు.

మన పురాణాల్లో బాల శబ్దానికి భీముడు, ఆంజనేయుడు పర్యాల శబ్దాలయినట్లు, ఆంధ్రదేశంలో రామ్మూర్తినాయుడిగారి పేరు బలానికి పర్యాయపదంగా పరిగణించబడింది. తన చివరి రోజుల్లో రామ్మూర్తినాయుడు బలంఘీర్ పాట్నా లో కల్వండే పరగణా ప్రభువు పోషణలో జీవితం గడుపుతూ మరణించారు.

వీరి బలప్రదర్శన విశేషాలను గురించి చెప్పుకోవలసి వస్తే

1) గట్టిగా ఊపిరి పీల్చుకుని, కండలు బిగించి, తన ఛాతీకి చుట్టిన ఉక్కు తాళ్ళను తెంచేవారు.

2) చాతీమీద ఏనుగును ఎక్కించుకుని 5 నిముషాలు నిలిపేవారు.

3) రెండు కార్లను, వాటికి కట్టిన తాళ్ళు రెండుచేతులతో పట్టుకుని కదలకుండా ఆపేవారు.

4) ఒంటిచేత్తో రైలు ఇంజను ఆపిన ఘటనలు

ఆనాటి ఇంగ్లాండు పాలకులైన కింగ్ జార్జ్, క్వీన్ మేరీలు రామ్మూర్తినాయుడి బలప్రదర్శనకు అబ్బురపడి 'ఇండియన్ హెర్క్యులెస్' బిరుదు ప్రదానం చేసారు.

ఇంకా కలియుగ భీమ, మల్లమార్తాండ, జయవీర హనుమాన్, వీరకంతీరవ వంటి బిరుదులూ కూడా శ్రీ రామ్మూర్తినాయుడు గారు స్వంతం చేసుకున్నారు.

# వేదుల సుబ్రహ్మణ్యాం



# ఎన్నికలలో-ఎన్ని కల్లలో

చం. కదులుచునున్న పీఠమిక కాదని యేక్షణ మూడికూలునో
కుదుటపడంగ నిల్చి తనుకూర్చొను బాగ్యము దక్కజేయునో
మది నరికట్టజాలక ప్రమాదము ముంచుకురాగ నేమి చే
యుదునని చింతతోకుములు యోధుల నెట్టుల నోర్చనౌదునో!!! 1

ఉ. నెమ్మినటించి గెల్చితమ నెత్తిన హస్తమునుంచి ముంచ దా
మమ్ముడుబోతిమంచు సభలందున గొంతులు చించుముందు నా
డుమ్మడి బేరమందు తమ కొగ్గిన ముడ్పుల గాథ చెప్పరే!
నమ్మినబేర "మోటు"నిడు నాడె బరాబరి యౌటెరుంగరో? ll 2

ఉ. నెత్తికి కన్నులెక్కి పలునేరములందున జిక్కి యెంతగా
మొత్తుకొనంగ నేమగును? మోమును జూపగ నెట్లుచెల్లు? తా
పెత్తనమున్నకాలమున పేరుగడించిన నొప్పెగాని సం
పత్తిని వక్రమార్గముల బాయగ గల్గవె ముప్పుతిప్పలున్?ll 3

ఉ. "ఓట్లకు నోట్లనిచ్చి కొని యోడినవారె మరింత జోరుతో
నెట్లనొ ముందువచ్చు మరొకెన్నికలన్ మునుముట్టజెప్పరే
నోట్లను! వేచియుందు"మను నోటరులున్న సమాజమందు వే
రెట్లు పొసంగు శ్రేయమిక నెల్లరు గూడుపుఠాణి జేయగన్ ll 4

ఉ. గంతలుగట్టి పేదల నగాధమునన్ దిగద్రొక్కు వారికిన్
చెంతనెయుండి చెప్పినది చెప్పినరీతిని జేయుముందు నొ
క్కింతయు జంకుజూపని మరెందరొ రక్కసులుండుదాక ని
శ్చింతగనుండి దుండగులు చేయు నకృత్యము లాపశక్యమే! ll 5

ఉ. వ్యక్తుల వెక్కిరించి కడు వేదనకున్ గురిజేయుకంటె వే
శక్తులుగూడి జేయదగు సంస్కరణాత్మక చర్యలందు నా
సక్తినిపెంచి సంఘముల చర్చలజేసి వినూత్నరాష్ట్ర సం
యుక్తమె ధ్యేయమంచరయు నుద్యమముల్ సృజియింప మేలగున్ll 6

ఉ. పట్టెడుకూడుకై కడుపుబాధ భరించగలేక నెట్టులో
పొట్టనుబట్టి యాకొనియు ప్రొద్దును నెట్టుచు సంజదాక నా
కట్టుకునుండి కష్టబడి కాసులుకొన్నిటి సేకరించినన్
పొట్టకు పట్టెడన్నమొక పూటకు రాక నిరాశ జెందరే! ll 7

ఉ. దేవునిమీద "నాన" నిడి "దీటుగజేయుదు సంఘసేవలన్
వేవురకెల్ల మేలెరిగి వేరె ప్రలోభము స్వార్థమున్ వినా,
కావు" మటంచు పల్కి వెస గంపెడు భారము మోయసిద్ధమై
పావులుత్రిప్పి బాధ్యతను ప్రక్కకు నెట్టిన "నాన" యొప్పునే? ll 8

చం. ప్రజలహితం బెరింగి తనపైబడు బాధ్యత గుర్తెరింగి తా
నిజమగు నాయకుండనగ నివ్వెరవోవ జనంబునెల్లరన్
స్వజనమనెంచి పాటుబడి స్వార్థమెరుంగక సేవజేయు నా
సుజనుల గౌరవించి తగుశోభిలు రీతి నుతింపనొప్పగున్ ll 9

శా. కైలాసంబున వాసముండి జగతిన్ కాలాంతకుండయ్యు నీ
కేలా యూరకనుండు టొప్పగును నీకింక న్నుమావల్లభా!
ఫాలాక్షుండవు మట్టుబెట్టుదువుగా బాధించు దుష్టాత్ముల
న్నేలా మామొరలాలకింపవు హరా! యీ బాధలందీర్చ రా! ll 10

# శ్రీనాధుని కాశీ ఖండం

## (వచనానుసరణం)

## పోచినపెద్ది మురళీ కృష్ణ



### ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రథమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తీ తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

- సంపాదకురాలు.

(గత సంచిక తరువాయి)

పంచామృతాభిషేకముతో అభిషేకించిన ఫలము అశ్వమేధము, వాజపేయము చేసిన ఫలముతో సమానము. విశ్వేశ్వరునికి ఛత్రము, చామరము, వింజామరము సమర్పించిన భక్తునకు ఏకఛత్రాధిపత్యము భిస్తుంది.

కాశీనగరములో నివశించు వారు అస్తిక్య బుద్ధి, వినయము, మానావమానములయందు సమానబుద్ధి, కోరికలు, రుమోతుతనము లేకుండుట,అహింస, దానములు పట్టకుండుట, దంభము లేకుండుట, పిసినికొట్టుతనము లేకుండుట, సోమరితనము లేకుండుట, పరుష స్వభావము లేకుండుట, దైన్యము లేకుండుట అలవరుచుకోవాలి.`

**వ్యాసుడు కాశీమీద కోపించుట**

వ్యాసునికి కాశీనగరంపై ఎందుకు కోపం వచ్చింది? అని అగస్త్యుడు కుమారస్వామిని అడిగాడు. బాదరాయునికి కోపంరావడానికి కారణాన్ని వివరిస్తాను" వినమని కుమార స్వామి ఈవిధంగా చెప్పడం ప్రారంభించాడు. నాలుగు వేదాలు విభజించినవాడు, అష్టాదశ పురాణాలు రచించినవాడు, భారతాన్ని రచించినవాడుఅయినవ్యాసుడు కాశీ నగరంలో శిష్యులకు కాశీ నగరంలో శివధర్మాన్ని బోధిస్తూ ఉన్నాడు. మాధూకర వృత్తితో నివశిస్తున్నాడు. నియమంతో నివశిస్తున్నాడు

ఈ విధంగా శివజ్ఞాన ప్రాప్తికోసం వ్యాసుడు, అతని శిష్యులు చాలాకాలం కాశీలో నివాసం ఉంటున్నారు. ఒకరోజున పరమేశ్వరుడు వ్యాసుని మనోనిబ్బరాన్ని తెలుసుకోవాలని పరమేశ్వరుడు నిర్ణయించి, విశాలాక్షిని పిలిచి " ఈ వ్యాసుని భక్తి ఏపాటిదో చూద్దాము. కాశీ నగరంలో అతనికి భిక్ష దొరక్కుండా చూడు" అని ఆదేశించాడు.



"మహాప్రసాదము" అని చెప్పి, కాశీ నగరంలోని గృహస్తుల మనస్సులో ప్రవేశించి ఎవరు బిక్ష వేయకుండా చూచింది.

వ్యాసుడు ప్రాతః కాలవిధులను నిర్వర్తించి, సూర్యోదయానికి ముందుగానే మణికర్ణికలో స్నానం స్నానం చేసి, సంధ్యావందనం పూర్తిచేసి, శివపూజ చేసి, ముక్తి మండపంలో శివపురాణం పఠించి, తరువాత బిక్షాటనకు బయలు దేరాడు. మోదుగాకు పళ్ళాలు పట్టుకొని, కాషాయ వస్త్రాన్ని జోలెగా కట్టుకొని, దాగరలు, తామరాకులు, పోకపొత్తికలు, గండోలగములు పట్టుకొని, పైసంపాయనాది శిష్యులతో కలశి బిక్షాటనకు బయలుదేరాడు. బీరెండలో వ్యాసుడు, వ్యాసుడి శిష్యులు ఇంటింటికి బిక్షాటనకై తిరుగుతున్నారు. పైల, సుమంత, జైమిని, వైసంపాయనాదులు, బిక్షాపాత్ర ధరించి నాలుగు మూలల తిరుగుతున్నారు. ఎవరికి బిక్ష లభించలేదు. చివరికి వ్యాసునికికూడా బిక్ష లభించలేదు. వ్యాసుడు " బిక్షాందేహి,బిక్షాందేహి" అని అడుగుతూ ఇంటింటికి తిరుగుతున్నాడు. "ఇంకా వంట కాలేదు, తిరిగిరా, మాఇంట నేడు దేవతార్చన," అని అనేక విధాలుగా గృహస్తులు చెబుతున్నారు. వ్యాసుడు అకలితో మఠానికి చేరుకున్నాడు. శిష్యులను పిలిపించి మీకు భిక్షాన్నము లభించిందా?ఈ వల్లకాటిలో నాకులభించనట్లుగానే మీకు లభించలేదా? అని అడిగాడు. కరువు కాటకాలలోను, ఇంటిలో పురుడు వచ్చిన సమయంలోను, ఇంటిలో ఎవరైనా మరణించి న సమయంలోను, అంటువ్యాధులు సోకిన సమయంలోను, ఇల్లు కాలిన సమయంలోను బిక్ష పెట్టేటటువంటి గృహస్తులు నేడు ఎందుకు బిక్ష పెట్టలేదు? ఇది ఆశ్చర్యంగా ఉంది.

"మనము ఈ కాశీనగరంలో చిరకాలంగా ఉన్నాం. ఏనాడైనా బిక్షలభించని రోజు ఉందా? ప్రతీ రోజు రెండు జాముల సమయందాటే సమ యానికి వాకిట గోమయంతో అలికి, ముగ్గుపెట్టి, ఆముగ్గు లో అతిధిని నిలబెట్టి, అర్ఘ్య పాద్యాదులు సమర్పించి, పూవులతో గంధముతో పూజించి, బంగారు గరిటితో అన్నముపై నేయి వేసి, పండ్లు, పరమాన్నం, పిండి వంటలు వడ్డించి, భక్తి విశ్వాసాలతో కాశీ నగరంలోని పురంధ్రీ మణులకు యతీంద్రులకు బిక్షను పెడుతూ ఉండేవారు. అటువంటివారు నేడు బిక్షాన్నం పెట్టలేదు. నేనీనాడు లేచి ఎవరి ముఖం చూసానో అని వ్యాసుడు బాధపడ్డాడు.

మీ ముఖంచూస్తే మీకు కూడా బిక్ష లభించలేదని తెలుస్తోంది. కళ్ళలను చూస్తే చేలోని పంట తెలుస్తుంది అన్నట్లుగా మీ పరిస్తితి తెలుస్తోంది. శిష్యులు నాలుగు మూలలకు వెళ్ళి చూసి వచ్చారు. ఏవిధమయిన అశుభాలు కనబడలేదు. తిరిగి వ్యాసునిదగ్గరకు చేరుకొని, "మహర్షి! ఈ నగరంలో ఏ విధ మయిన అశుభాలు కలుగలేదు. మీరు ఇక్కడుండగా అశుభాలు ఎలా కలుగుతాయి? అని విన్నవించుకున్నారు.

(ఇంకా వుంది)

# తుమ్మూరి రాంమోహన్ రావు



## తెలంగాణా మహానుభావులు

### 6. రైతు రామాయణ కర్త 'రైతు వాల్మీకి' శ్రీమాన్ వానమామలై జగన్నాథాచార్యులు

**'తాత పండితుండు తండ్రి శాస్త్రజ్ఞుండు**
**అన్నదమ్ములును మహా కవులట**
**ఇట్టి వంశమునందు పుట్టు పుణ్యంబుండ**
**ఏమిగాక పోవుటేమి నేను'**

అని తనను తాను పరిచయం చేసుకుంటూ


**'ఏను గర్వింతు తెలుగు మాగాణమందు**
**తెలుగు మొలకనై పుట్టినందులకు దెలుగు**
**వెలుగు నీడల బెరిగినందులకును తెలు**
**గమ్మ పదసేవ నోచికొన్నందులకును'**

అంటూ 'తెలంగాణా మాగాణములో పుట్టిన మొలక' అనే వాక్యాన్నితాను రాయబోయే "రైతు రామాయణ"ప్రబంధానికి నాందీ సూచకంగా తెలిపిన కవి శ్రీమాన్ వానమామలై జగన్నాథాచార్యులు.

వానమామలై వంశనామము వినగానే మన మనసుల్లో మెదిలే పేరు ఆ వంశ ప్రతిష్ఠకు కారకుడైన 'అభినవ పోతన' శ్రీమాన్ వానమామలై వరదాచార్యులు. తెలంగాణాలో కవులే లేరన్న అపప్రథనుంచి కాపాడిన కవులలో నిస్సంశయముగా వరదన్న ఒకరు.బమ్మెర పోతన తన హాలిక జీవనానుభవాలను రాయడానికి జగ్గన్నగా,తన జీవిత కథను వ్రాసుకోవడానికి వరదన్నగా వానమామలై వంశంలోఅన్నదమ్ముల రూపంలో జన్మించారేమోనని పిస్తుంది ఈ ఇరువుర కావ్యాలు చదివితే.

జగ్గన్న తండ్రి వద్ద శబ్దమంజరి మాత్రమే నేర్చుకున్నాడు.కుటుంబ పోషణార్థం తండ్రి తరచు
వేరే ఊళ్లకు వెళ్లుతుండటంతో జగ్గన్న,వరదన్నల ప్రాథమిక విద్యాభ్యాసమంతా పెద్దన్న వెంకటాచార్యులవద్దనే జరిగింది.పన్నెండవ ఏట ఇల్లిందకుంట సీతారామస్వామి సన్నిధిలో ఉపనయనం జరిగింది.ఉపనయనానికి ముందే తెలుగు వాచకం చదవటం,దాశరథి సుమతి శతకాలు కంఠతా చదవడం అలవడ్డాయి.ఆ తరువాత ముందు తెలుగులోనూ,తరువాత సంస్కృతంలో-

నూ పరిశ్రమ చేశారు.అన్నగారి ప్రాపకంలో శ్రీవైష్ణవ సంప్రదాయ గ్రంథాలు,కావ్యాంతం వరకు విద్య,తమిళ లిపి నేర్చుకున్నారు. హైదరాబాదు నైజాం పాఠశాలలో నాలుగు తరగతి నుండి ఏడవ తరగతి దాక చదువుకున్నారు. ఆతరువాత హన్మకొండలో ప్రైవేటుగా చదివి ప్రీ మెట్రిక్,మెట్రిక్ పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు. కాళోజీ,పల్లా దుర్గయ్య,బిరుదురాజు రామరాజు వంటి మిత్రుల సాహచర్యంలో తెలుగు సంస్కృతాలతో పాటు హిందీ ఇంగ్లీషు ఉరుదూ తమిళ భాషలలో ప్రావీణ్యం సంపాదించారు.అప్పట్లో తెలుగు సాహిత్యంలో ప్రాచుర్యం కలిగి ఉన్న తిరుపతి వేంకట కవులు,రాయప్రోలు,నండూరి వంటి వారల కవిత్వం,చిలుకమర్తి,పానుగంటి వారల రచనలు చదివి సమకాలీన తెలుగు సాహిత్యం మీద అవగాహన పెంచుకున్నారు.ఆచార్యులవారికి వాల్మీకి రామాయణం,కాళిదాసు అభిజ్ఞానశాకుంతలం, తిక్కన మహాభారతం,భవభూతి ఉత్తర రామ చరిత దాదాపుగా పారాయణ గ్రంథాలు.



శ్రీ వానమామలై జగన్నాథాచార్యులు

సహజంగా మంచి కంఠం కలిగిన జగన్నాథాచార్యులుగారికి సంగీతం అంటే మక్కువ.చలనచిత్రాల కంటే ఆ రోజుల్లో నాటకాలకే ఎక్కువ ఆదరణ ఉండేది. పెద్ద పెద్ద నాటక సమాజాలవాళ్లు హనుమకొండలో నాటకాలు ప్రదర్శిస్తేమిత్రులతో కలిసి చూడటం,అందులో పేరుమోసిన నటుల పద్యాలు,పాటలు శ్రద్ధగా విని వారి లాగా అనుకరించి పాడటం,అభ్యాసం చేసేవారు. దానికి తోడు ఒక పాత గ్రాంఫోను సంపాదించి కపిలవాయి,నిడుముక్కుల మొదలగు ప్రసిద్ధుల రికార్డులను మడికొండ దగ్గరలో ఉన్న మెట్టుగుట్ట మీద తమ్ముడితో సహా మిత్రులతో కలిసి వినడం పాడటం చేసేవారు.

అలా వింశతి ప్రాయంలోపే సంగీత సాహిత్యాలపై పట్టు సాధించుకున్నారు మన రైతు రామాయణ కర్త వానమామలై జగన్నాథా చార్యులు. తరువాతి కాలంలో సాహిత్యం తెలుగు అధ్యాపనానికి,- సంగీతం హరికథా కాలక్షేపానికి ఉపయోగపడింది.అవి రెండూ ఆయనలోని ఆధ్యాత్మిక,- సామాజిక ఆదర్శ భావాలకు అనుగుణమైన సాహిత్య సృజనకు విశేషంగా దోహద పడ్డాయి.

సంప్రదాయ శ్రీవైష్ణవ కుటుంబంలో జన్మించినా,ఆధ్యాత్మిక భావ సంపన్నులైనా వీరి సామాజిక స్పృహకు కొదవేమీ లేదు.సమకాలీన రాజకీయ పరిస్థితులకనుగుణంగా వీరిలో స్పందన కనిపిస్తుంది.అడపా దడపా రాసిన వీరి అభ్యుదయ గేయాలు అప్పట్లో జువ్వాడి గౌతమరావుగారి వంటి వారు తమ పార్టీ మీటింగులలో పాడేవారు,పాడించేవారంటే ఆ గేయాల ప్రాశస్త్యం తెలుస్తున్నది.హరికథా కాల క్షేపాల్లో వీరి గేయాలను కోరి వినే వారట. అందులో మరీ ఎక్కువ ప్రాచుర్యం పొందిన గేయం.

"మారుతున్నదీ ప్రపంచం మారనున్నదింకా కొంచెం
మధ్యవర్తి గుడుగుడు గుంచం మడతజేబులల్లో చెంచెం
కోరుచున్నదింకా లంచం గొప్పగొప్ప వారిదె పింఛం
బొడ్డు చావడి పైనా సంఘం ప్రొద్దు పోని వృధా ప్రసంగం
అడ్డు తగల నదియొక రంగం అయ్యనిల్పినది ఒక లింగం
అమ్మానాన్నలకో కొల గాసం ఆలి అడుగులో కైలాసం
కూడు దినగ బంగరు కంచం కూర్కు దియ్య చప్పరు మంచం"

ఇలా సాగే వీరి గేయం అప్పటి సమాజానికి అద్దం పట్టేదిగా ఉంది.ఆయన గొంతెత్తి పాడితే మంత్ర ముగ్ధులయ్యేవారట.

చిన్నప్పట్నుంచే పండిత గోష్ఠుల్లో కూర్చోవడం,కవితా ధారలను గ్రోలటంతో యుక్త వయస్సులోనే వీరికి కవిత్వంపై మక్కువ ఏర్పడింది.మనసులో మెదిలే భావాలను తన కవిత్వం ద్వారా వెలి బుచ్చాలనే అభిలాష కలిగింది.ఉరకలు వేసే వయస్సులో ఒక స్త్రీని చూచి వెనువెంటనే అలా ఆలోచించడం పాపం అనిపించడం అదే ఆయన తొలి కవితగా రూపొందడం వారి సంస్కారానికి, సాహిత్య దృష్టికి పునాది.అది

'చక్కదనపు చాన నెక్కువ జూచెదు
దాని నెవరు మట్టి తోనొనర్చె
అట్టివాని చేతియందంపు చందంబు
చూడగోరనైతి పాడు మనస!'

తరువాత 'కార్పాసరామలక్ష్మి'అను నాటకం వ్రాసి మిత్రులకు వినిపించారట.అది అలభ్యము.రైతు రామాయణానికి తొలి పలుకులు రాసిన పల్లా దుర్గయ్య గారు దాన్ని గురించి ప్రస్తావిస్తూ "వైష్ణవ భక్తుల్లో కార్పాస రామలక్ష్మి(పత్తికొల్లినాయచ్చార్) ఒకరు.ఈమె తన ఇంటికి వేంచేసిన భగవద్రామానుజులకు వారి ప్రియ శిష్యులకుఆతిథ్యమివ్వడానికి పేదరాలైనా తన ప్రాకృత శరీరాన్నాశించిన ధనికుడైన శ్రేష్ఠికి అర్పించడానికి సిద్ధపడి భాగవతాచార్య కైంకర్యం చేయడానికి పూనుకుంటుంది.చివరకు ఆమె ఆదర్శం వల్ల కనువిప్పు కలిగి ఆ ధనికుడు, ఆమె పాదాల పైబడి మన్నించమంటాడు. కథ సుఖాంతమవుతుంది."

ఇందులో హాలికవృత్తితో (ప్రత్తి పంట ఆధారంగా) జీవనాన్ని గడిపే ఆ పేద దంపతుల జీవితాలు చక్కగా వర్ణించబడ్డట్లు దుర్గయ్యగారు పేర్కొన్నారు.నాటకం విన్నవారిలో వారొకరు.అందులోని ఒక పద్యం 1931 లో ప్రచురించబడిన గోలకొండ కవుల సంచికలో ముద్రితమయినట్లు ఆయన తెలిపారు.

"తలదాచుకొనుటకు తగు నీడయును లేని
యొక చిన్న గుడిసె వారుండు వసతి
ఆదాయమది రోళ్ల అడుగునబడియున్న
యొక కొన్ని గింజల నూడ్చికొనుటె
భార్యయా తానొక పరమ సాధ్వీమణి
యిలుదాటి పొరుగిల్లు నెరుగదెపుడు
మానమ్ము గాపాడుమాత్రపు జినుగుడు
పేలికే వారికి చాల కరువు
ఇట్టి కష్ట జీవనమునినేని నాథు
ననదు పల్లెత్తు మాటయునైన యెపుడు
పతిపదారవిందములె శ్రీపతిపదార
విందములటంచు లక్ష్మినా వెలసె భువిని
వరదగురు గృహలక్ష్మి కార్పాసలక్ష్మి"

(ముగింపు వచ్చే సంచికలో)

# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు





# SPOKEN SANSKRIT

+91 9897959425

## (సంభాషణ సంస్కృతం -26)

**Unit 1.** षष्ठी विभक्ति: (संबन्ध सामान्ये)

**This** षष्ठी विभक्ति **is called possessive case in English. It is used to express one's relationship with others. Relations are of many kinds. There are around 108 relations. They are between father and son, mother and son, teacher and taught, brother and sister, wife and husband and so on. Every relation ship is expressed in possessive case.**

షష్ఠీ విభక్తికి కారకత్వము లేదు . ఇది ఒక నామవాచకమునకు వేరొక నామవాచకముతో గల సంబంధం తెలియజేయడానికి ఉపయోగపడుతుంది .

ఈ సంబంధం ఎన్నో రకాలుగా ఉంటుంది. తండ్రి- కొడుకుల సంబంధం, తల్లి - కొడుకుల సంబంధం, భార్యా-భర్తల సంబంధం, యాజమాన -సేవకసంబంధం, గురు-శిష్య సంబంధం, స్వ-స్వామి సంబంధం అంటే నేను –నాది అనే సంబంధం మొదలైనవి. ఇవి సుమారు 108 వరకు ఉన్నాయని పెద్దలు చెబుతారు. ఏ సంబంధమైనా ఈ షష్ఠీ విభక్తి తెలియ జేస్తుంది .

पितृपुत्रसंबन्ध : (తండ్రి కొడుకుల సంబంధం)

शिवस्य पुत्र: गणेश: (శివస్య పుత్ర: గణేశ: )

**Ganesha is the son of Siva.**

रामस्य पिता दशरथ: ( రామస్య పితా దశరథ: )

**Dasaratha is the father of Rama.**

मातृपुत्रसंबन्ध: తల్లి కొడుకుల సంబంధం

रामस्य माता कौसल्या( రామస్య మాతా కౌసల్యా)

**Kausalya is the mother of Rama**

सुमित्राया: पुत्र: लक्ष्मण: ( సుమిత్రాయా: పుత్ర: లక్ష్మణ: )

**Lakshmana is the son of Sumitra**

3. भार्याभर्तृसंबन्ध: (భార్యా భర్తల సంబంధం )
सीताया: पति: राम: ( సీతాయా: పతి: రామ: )
शिवस्य पत्नी पार्वती ( శివస్య పత్నీ పార్వతీ )
4. सोदरसोदरी संबन्ध: (సోదరసోదరీ సంబంధ: )
रामस्य सोदरी शान्ता
द्रौपद्या: सोदर: दृष्टदयुम्न:
कृष्णस्य सोदर: बलराम:
सुभद्राया: सोदर: कृष्ण:
5. गुरुशिष्यसंबन्ध : (గురుశిష్య సంబంధం )
विश्वामित्रस्य शिष्य: राम:
अर्जुनस्य गुरु: द्रोणाचार्य:
6. देवर: ( पत्यु: सहोदर: ) husband's brother (మరది)
సీతాయా: దేవర: లక్ష్మణ:
7. भ्रातृजाया ( सहोदरस्य पत्नी ) brother's wife వదిన
లక్ష్మణస్య భ్రాతృజాయా సీతా
8. याता ( देवरस्य पत्नी ) co daughter-in - law తోడికోడలు
सीताया: याता उर्मिला
సీతాయా: యాతా ఊర్మిళా
9. आवुत्त: (सोदर्या : पति: ) sister's husband బావగారు
कृष्णस्य आवुत्त: अर्जुन:
కృష్ణస్య ఆవుత్త: అర్జున:
10. भागिनेय: ( भगिन्या: अपत्यं पुमान् ) nephew మేనల్లుడు
कृष्णस्य भागिनेय: अभिमन्यु:
కృష్ణస్య భాగినేయ: అభిమన్యు:
11. भागिनेयी ( भगिन्या: अपत्यं स्त्री ) niece మేనకోడలు
12. पितृव्य: (पितु: भ्राता ) father's brother పినతండ్రి లేదా పెదతండ్రి
लवस्य पितृव्य: लक्ष्मण:
లవస్య పితృవ్య: లక్ష్మణ:
13. मातुल: ( मातु: भ्राता ) maternal uncle మేనమామ
अभिमन्यो: मातुल: कृष्ण:
అబిమన్యో: మాతుల: కృష్ణ:
दुर्योधनस्य मातुल: शकुनि:
14. विमाता ( मातु: सपत्नी ) co – wife (సవతి)
ద్రౌ పద్యా: సపత్నీ సుభద్రా .
15. ननान्दा ( पत्यु: सोदरी ) husband's sister

**16.** श्वशुर: ( पत्यु: पिता 0r पत्न्या: पिता } **Father- in law మామగారు**
अर्जुनस्य श्वशुर: द्रुपद द्रुपद:
रामस्य श्वशुर: जनक:
17. श्वश्रू: ( पत्न्या: माता or पत्यु: माता ) **Mother-in-law అత్తగారు**
सीताया: श्वश्रू: कौसल्या
द्रौपद्या: श्वश्रू: कुन्ती
**18.** पितामह:**తాత** ( पितु: पिता ) **Father's father తండ్రి యొక్క తండ్రి**
**19.** पितामही **నాయనమ్మ** ( पितु: माता ) **Father's mother తండ్రి యొక్క తల్లీ**
**20 .** मातामह: (मातु: पिता ) **Mother's father తాతయ్య తల్లీ యొక్క తండ్రి**
**21.** मातामही **అమ్మమ్మ** (मातु: माता ) **Mother's mother తల్లి యొక్క తల్లి**
**22.** पौत्र: **మనుమడు** (पुत्रस्य पुत्र: ) **son's son కొడుకు యొక్క కొడుకు**
**23.** पौत्री **మనుమరాలు** ( पुत्रस्य पुत्री ) **son's daughter కొడుకు యొక్క కూతురు**
**24.** दौहित्र: **మనుమడు** ( पुत्रिकाया: पुत्र: ) **daughter's son కూతురు యొక్క కొడుకు**
**25.** दौहित्री **మనుమరాలు** ( पुत्रिकाया: पुत्री) **daughter's daughter కూతురి యొక్క కొడుకు**
**26.** देवर: **మరది** (पत्यु: सोदर: ) **husband's brother భర్తయొక్క సోదరుడు**
**27.** भ्रातृजाया **వదిన** (सोदरस्य पत्नी ) **Brother's wife సోదరుని భార్య**
**28.** जामाता **అల్లుడు** ( पुत्र्या: पति: ) **Son-in law daughter's husband**
जनकस्य जामाता राम:
**29.** स्नुषा **కోడలు** (पुत्रस्य पत्नी ) **Daughter – law Son's wife** दशरथस्य स्नुषा सीता
**30.** स्वस्वामिभावसंबन्ध: **(నేను నాది అనే సంబంధం)**
**ఈ ఇల్లు నాది. నేను ఈ ఇంటి యజమానిని**
इदं मम गृहम् | अहम् एतद्गृहस्य यजमानी
अस्माकं देश: भारतदेश: || वयं भारतदेशस्य पौरा:

**Unit :- 2.** अध्ययनम् इत्यस्य कर्मण:

**ఒక వాక్యంలో హేతు శబ్దం ఉపయోగించినప్పుడు ప్రయోజనం , హేతుశబ్దం ఈ రెండు షష్ఠీ విభక్తి పొందును .**
स: बालक: अन्नस्य हेतो: ग्रामे निवसति ||
**That boy is living in a village for food.**
एष : बालक: अध्ययनस्य हेतो: काश्यां निवसति
**This boy is living in Kasi for studies.**
**షష్ఠీ విభక్తి మరికొన్ని సందర్భాలలో కూడా వస్తుంది . అవన్నీ ముందు ముందు తెలుసుకోవచ్చు . ఇప్పుడు షష్ఠీ విభక్తి రూపాలు ఎలా ఉంటాయో ఉదాహరణ కోసం కొన్ని చూడండి .**
षष्ठी-- एकवचन - द्वि – बहु
राम: --रामस्य – रामयो: - रामाणाम्

हरि:-- हरे: - हर्यो: हरीणाम्
गुरु: - गुरो: - गुरवो: गुरुणाम्
रमा :- रमाया: - रामयो: - रमाणाम्
गौरी:- गौर्या: - रौर्यो: - गौरीणाम्

## Unit : - 3. SANSKRIT SLOKA

ఒకసారి కాళిదాసమహాకవి కాశీనగరం సందర్శించాడు. అన్ని దేవాలయాల్లో ఉండే దేవీదేవతలకు నమస్కరిస్తూ పోతున్నాడు. ఒక ప్రదేశంలో వ్యాసభగవానుని విగ్రహం కనిపించింది. ఎందుకో ఆయనకు నమస్కరిం చాలనిపించ లేదు, సరిగదా ఆక్షేపించాలనిపించింది. ఆయన బొడ్డులో వ్రేలు పెట్టి 'చకారకుక్షి' 'చకారకుక్షి' అని ఆక్షేపణ చేశాడు . అంతే వ్రేలు ఆ విగ్రహం బొడ్డులో ఉండిపోయింది. ఎంత లాగినా బయటకు రావడం లేదు. వ్రేలు బయటకు తీసుకోవడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఇంక చేసేదేమీ లేక తన తప్పు క్షమించమని మనసులోనే ప్రార్థించాడు. వ్రేలు బయటకు వచ్చేసింది. ఆ విగ్రహం లోంచి సాక్షాత్తు వ్యాసభగవానుడు ప్రత్యక్షం అయ్యాడు. వెంటనే కాళిదాసు ఆయన పాదాలను తాకి నమస్కరించాడు.

వ్యాసుడు సంతోషించి 'నాయనా! ఎందుకు నన్ను అలా ఆక్షేపించావు?' అనడిగాడు. స్వామీ! మీరు వ్రాసిన మహాభారతం చదివాను. "ధర్మజ: చ భీమ: చ అర్జున: చ నకుల: చ సహదేవ: చ" అని గ్రంథమంతా 'చ' అనే అక్షరాలే. అవన్నీ వ్యర్థపదాలే. అన్నీ ప్రోగుచేసి మరో చోట వ్రాస్తే అదో పెద్ద గ్రంథమౌతుంది. ఏమిటి స్వామీ ఇదంతా ! మీ పొట్ట కోస్తే అన్నీ చకారాలే అనిపిస్తోంది. అందుకే ఆక్షేపించానన్నాడు.

అపుడు వ్యాసుడు 'నాయనా! నువ్వు అనుకుంటున్నట్లు అవన్నీ వ్యర్థపదాలు కావు, వాటికి సార్థకత ఉంది . సరే! నా సంగతలా ఉంచు. నేనొక అంశం నీకిస్తాను. చకారం లేకుండా అది పూర్త చెయ్యి' అన్నాడు. సరే అన్నాడు కాళిదాసు. వ్యాసుడు కాళిదాసుతో ' ద్రౌపదికి ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అని ఐదుగురు భర్తలు కదా! వారిమధ్యగల పరస్పరసంబంధాన్ని వివరిస్తూ, 'చ' అనే అక్షరం ఉపయోగించకుండ శ్లోకం చెప్పమని అడిగాడు. కాళిదాసు ఏమి తడుముకోకుండా:

द्रौपद्या: पाण्डुतनया: पति देवर भावुका:
न देवरो धर्मराज: सहदेवो न भावुक:

{ద్రౌపద్యా: పాండుతనయా: పతిదేవరభావుకా:
న దేవరో ధర్మరాజ: సహదేవో న భావుక:} అనే శ్లోకం చెప్పాడు

(ద్రౌపదికి ధర్మరాజు, భీముడు , అర్జునుడు , నకులుడు , సహదేవుడు; భర్తలు , బావలు మరదులు ఔతారు . ధర్మరాజు ఎప్పుడు మరిది కాడు. సహదేవుడు ఎన్నడు బావ కాడు).

ద్రౌపదికి ఐదుగురు భర్తలున్నా ఒక సంవత్సరం అంతా ఒకరితోనే ఉంటుంది. ఇది నియమం. ఆమె ధర్మరాజుతో ఉన్నప్పుడు ఆయన భర్త. మిగిలిన నలుగురు మరదులౌతారు. భీమునితో ఉన్నప్పుడు ధర్మరాజు బావ ఔతాడు , అర్జున,నకుల,సహదేవులు మరదులౌతారు. ఇక సహదేవునితో ఉంటున్నప్పుడు పై నలుగురు బావలౌతారు. కాని ధర్మరాజు ఎన్నడూ మరది కాదు , సహదేవుడు ఎన్నడూ బావ కాడు. ఇక వ్యాసుడు కాళిదాసు ప్రతిభకు సంతోషించి, ఆశీర్వదించి, అదృశ్యమయ్యాడు.

# ఆదూరి హైమవతి



## చమత్కారవాక్కు

రామాపురం అనే ఒక చిన్న పల్లెటూర్లో రైతులు ఎక్కువమంది ఉండే వారు.వారు పశువుల పెంపకంతోనే జీవనం సాగించేవారు.పాలు తీసుకెళ్ళి పక్కనే ఉన్న పట్టణంలో అమ్ముకుంటూ, ఉన్న పాటి కొద్ది పొలంలో కాయకూరలు పండించుకుంటూ ,చేతనైనవారు వ్యవసాయంచేసుకుంటూ జీవించేవారు.

ఆఊర్లో ఇద్దరు పెద్ద ఆసాములు ఉన్నారు. వందేసి ఎకరాల పొలాలూ, తోటలూ ఉండి చాలా పసు సంతతి కలిగి ఉండేవారు. వారి పసువులకు ఏదైనా వైద్య వసతి కావల్సివస్తే తమ ట్రాక్టర్లమీదనగరానికి తీసుకెళ్ళి ప్రైవేటు వైద్యుల చేత వైద్యం చేయించుకునేవారు , అత్యవసరమైతే తమ జీపులో ప్రైవేటు వైద్యులను ఇంటికి పిలిపించుకుని వైద్యం చేయించుకునేవారు .అంతేకానీ ఊరివారి గురించీ ,ప్రభుత్వ వైద్యాశాలఏర్పాటు గురించీకానీ ఆలోచించే వారే కాదు .

పైగా వారు పరమ పిసినారి వారు.ఒక ఆసామి ఊరికి తూర్పున ఉండేవాడు . ఆయనపేరు లక్ష్మయ్య , ఐతే ఊరివారంతా లోభి లక్షయ్య అని పిలుచుకునే వారు . పిల్లికి బిచ్చంపెట్టడం అతనికి తెలియదు. మరొక ఆసామీ ఊరికి పడ మర ఉండేవాడు ఆయనపేరు పాపయ్య, అతడ్నీఅంతా పిసినారి పాపయ్య అని పిలుచుకునే వారు. కాకికి మెతుకులు విదిలించడ కూడా అతనికి పడదు.తమకోసం తప్ప ఇతరులకోసం ఒక్క దమ్మిడీ ఖర్చుపెట్టరు వారిద్దరూనూ. ఒకరంటే ఒకరికి పడేదికాదు, ఉప్పు నిప్పు లాంటిది వారి మనస్తత్వం. వీరిద్ద మధ్యా సన్నకాఎఉరైతులు అనేక్ ఇబ్బందులుపడేవారు..

ఇలాఉండగా ఒకమారు ఆ ఊర్లో పసువులకంతా తెలీని జబ్బు వచ్చి, నడవ లేకపోడం , మేత మెయ్యలేకపోడం జరిగింది , నిరసించినేలమీద చతికిలబడి పోయాయి.అంతా పేదలైనందున వైద్యుడు లేనందున చాలా బాధ పడసా గారు. ఆపసువులేవారి ఆస్థీ పాస్థీనీ.

ఆఊరి రైతుబిడ్డైన రాము నగరంలో తనమేనత్త వద్ద ఉండి పశువుల వైద్యుడై అక్కడే ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్నాడు. తండ్రి రాయించిన లేఖ ద్వారా తన ఊరి పశువుల పరిస్థితి తెల్సుకున్న రాము ఒకరోజున నగరం నుండి తన వాహనంలో తన సిబ్బందితో ,కావలసిన సరంజామాతో వచ్చాడు.

ఆఊరి మధ్యన గల రచ్చబండదగ్గర తాను తెచ్చిన షామియానా వేయించి, కావలసిన ఏర్పాట్లు చేసుకుని ఊరిపేదరైతుల పశువులకు ఆవ్యాధికి వైద్యం చేయసాగాడు. తనతోవచ్చిన వారి సాయంతో రాత్రింబవళ్ళూ కష్టపడి ,మూడు రోజుల్లో ఊర్లో పేదరైతుల పశువులన్నింటికీ వైద్యసేవలు అందిం చాడు. ఒక్కపశువుకూడా మరణించకుండా సమయానికి ఆదుకున్నందుకు ఊరి వారంతా వచ్చి రాము సేవలను కొనియాడారు.

మూడోరోజు రాత్రి పది గంటలకు వైద్యసేవలు అందించినవారంతా భోజనం చేసి కాస్త విశ్రాంతిగా నడుంవాల్చారు. ఇంతలో ఊరికి తూర్పున ఉండే లోభి లక్షయ్య పాలేరూ,పడమర ఉండే పిసినారి పాపయ్య పాలేరూ ఒకేమారు వచ్చారు.

" మాపెదరైతు లక్షయ్య గారి పశువులకు జబ్బొచ్చి కిందపడి కొట్టు కుంటున్నాయి. వెంటనే బైల్దేరి రా !"అంటూ అధికారపూర్వకంగా పిలిచాడు లక్షయ్య పాలేరు.

"కాదు కాదు ముందు మా కాపు పాపయ్య పశువులకు వైద్యం సే-

యాల్సిందే , మా దొర కాడికి రావాలె,లేలే బేగిరా " అంటూ పాపయ్య పాలేరు మొదలెట్టాడు. ఇద్దరూ వాదులాడుకో సాగారు.

రాము లేచి "చూడండి బాబాయి లూ! నేను డబ్బుతీసుకునివైద్యంచేసే వైద్యు నికాదు. అందువల్ల ఎవరి పశువులైతే రచ్చబండదగ్గర కొస్తాయో వా టి కంతా వైద్యం చేస్తాను.ఎవ్వరిళ్ళకూ రాను. ఊరి రైతుల పశువుల కంతా అలాగే వై ద్యం చేసాను. మీ దొరల పశువులకైనా అంతే. వెళ్ళి బండిలో వేసుకు రండి." అనిచెప్పాడు.

ఇద్దరికీ కోపం వచ్చింది."చూస్తాంనీపని" అంటూ వెళ్లారు.

ఐతే ఆపశువుల రోగం ఎక్కువకావటాన ఆ పెదకాపుల తండ్రు లు "మీ పట్టింపులకూ గొప్పలకూ పోయి పశువుల ప్రాణాలు తీసుకో కండి. తీసుకెళ్ళి వైద్యం చేయిం చండి "అని కోప్పడటాన ,వాటిని కాపాడుకోను మరోదారిలేక ఇద్ద రూ తమ తమ ట్రాక్టర్లమీద పశువులను వేయించి రచ్చబండదగ్గరకూ తోలించారు. రాము ఇద్దరి పశువులకూ తన సిబ్బంది సాయంతో సమయానికి వైద్యం అందించాడు. ఇద్దరి పశువులూ బతికాయి. ఆమరునాడు ఉదయాన్నే ఆపసువులకు ఇంకావేయాల్సిన మందులగురించీ చెప్పను ముందుగా పిసినారి కామయ్య ఇంటి కెళ్ళాడు రాము.

"బాబయ్యా! ఆ లక్ష్మయ్య ఇలా తన పసువులన్నీ జబ్బు బారినపడకుండా తను ఈ ఊర్లో ఒక పశువైద్య శాల కట్టిస్తాట్ట, మీపేరేమై పోను?. అతడు వైద్యశాల కట్టిస్తే మీరు అంతే ఖరీదయ్యే పశువైద్యశాలకు పరికరాలు, మందులూ సమకూర్చండి. మీరేంతక్కువ వారా ? అతడి ఫోటో పేరుతో పాటుగా మీ ఫోటో పేరూ పెద్దగా వ్రాయిస్తాను , నేనె ఐక్కడ వైద్యునిగా వస్తాను" అనిచెప్పాక, తనకంటే ఎదుటి వానికి పేరురావడం ఇష్టంలేక కామయ్య అంగీకరించాడు. అలాగే లక్షమయ్య దగ్గరకెళ్ళి మాట్లాడాడు రాము. దాంతో అతడూ తనవైరి పేరు ఒక్కటే అంతా చెవుకోడం ఇష్టపడక అంగీకరించాడు. అలా ఇద్దరినీ ఒప్పించి వైద్యశాల కట్టించి, పరికరాలూ తెప్పించి పేర్లూ వ్రాయించి, ఫోటోలు పెట్టించి, మంత్రులను పిలిపించి ప్రారంభోత్సవం చేయించాడు.తానే ఆ ఊరికి వైద్యునిగా వచ్చాడు.నోరులేని జీవాలను కాపాడను రాముా వేసిన పథకం ఫలించి ఊరి పేదరైతుల బాధలు తీరాయి. ఎంతోకాలంగా ఉన్న ఆ ఊరి సమస్య అలా రాము మంచి మాటలవలన, చాకచక్యంవలన తీరి నందుకు ఊరి రైతులంతా ఆనందించారు. రోజూ ఇద్దరు లోభులూ అటూకేసి వచ్చి తమఫోటోలు చూసుకుని ఆనందిస్తూ పరస్పరం పలక రించు కుంటూ వైరం మరచారు.

---

# 70 వ గణతంత్ర వేడుకలు



70 వ గణతంత్ర వేడుకలను దేశమంతటా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాదు లోవాడ వాడలా ప్రజలు ఈ సంబరాల్ని జరుపుకున్నారు. ఆడ, మగ, పిల్ల, పాప, వయో వృద్ధు లు ఇలా ఒకరేమిటి అందరిలో దేశభక్తి భావం పెల్లుబికింది.

రాజేంద్రనగర్ మండలం లో ఉన్న హైదర్ గూడ లోని జన ప్రియ ఉటోపియా వసతి సముదాయంలో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

జై హింద్ !

VIDEO

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

సంవత్సరం పొడవునా పశువులకు కావాల్సిన ఎండు-గడ్డిని అంతా 'వామి' వేస్తారు. వామి వెయ్యటం కూడా ఒక గొప్ప సాంకేతిక కళ. వర్షం వస్తే తడవకూడదు. ఈ వరిగడ్డి ఇరువైపులకు కొసలు వచ్చేటట్టు వేస్తే, కురిసిన వాననీళ్ళు అన్నీ కిందికి కారిపోతాయి. పైన కొంచెం వెడల్పుగా వేస్తారు కాబట్టి ఈ వరిగడ్డి తోనే 'ఎంట్లు' పేని వామికి ఇటు అటు వైపు దిగేసి చివరలకు 'గజ్జి' రాళ్ళు కడతారు. ఈ బరువుకు గడ్డి గాలికి లేవదు. వానకు తడవదు.

ఒకవైపు నుండి ఈ గడ్డిని 'దుసి' గుండుజొల్లలనిండా పెట్టుకుని ఎద్దుల కొట్టంలో చేర్చి మంచ పై వేసి అప్పుడప్పుడు గాల్లో వేస్తూవుంటారు. కొత్తపంట వచ్చేవరకు ఈ గడ్డిని జాగ్రత్తగా వాడతారు. వర్షాలు పడి పచ్చిగడ్డి మొలచిన తరువాత పచ్చిగడ్డి వేస్తారు. క్రింద అడుగు ఎత్తున వుండటం వలన గడ్డికి చెదలు పట్టదు. వర్షం నీళ్ళు కింద నిలిచినా తడవదు.

### వృత్తులు

మా ఊరిలో అందరి వృత్తి వ్యవసాయమే. ఇది ప్రధానమైన వృత్తి. ఆ తరువాత కులవృత్తులు, ఉపవృత్తులు వుండేవి. వ్యవసాయ పనిముట్లు తయారు చేయడానికి లేదా ప్రతి సంవత్సరం 'కొరముట్లు' సరిచేయడానికి ఊర్లో 'పీరుసాబు' కుటుంబం వుండేది. వీరిది 'దూదేకుల' కుటుంబం. అవి చెడిపోతే సరిచెయ్యటం, చిన్నపిల్లలకు బొంగరాలు తయారుచెయ్యటం చేసేవారు.

బ్రాహ్మణులకు పురోహితం, నాయీబ్రాహ్మనులకు మేళతాళాలు వాయించటం, ఇలా ఎవరి కులవృత్తి వారికుండేది. సాయిబులకు మాత్రం కులవృత్తి అంటూ ఏదీ లేదు కాబట్టి ఏ వృత్తి అయినా చేసేవారు. ఉన్న నాలుగైదు వైశ్య కుటుంబాలు వ్యాపారం చేసేవారు. చిన్న అంగళ్లు పెట్టుకునేవారు. ప్రత్యేకంగా చెప్పాలంటే తమ పొలంలో పండిన పత్తిని పత్తిరాట్నాలు తిప్పి, గింజలు పశువుల కొరకు ఎత్తిపెట్టి, దూదిని 'ఏకులు'గా చేసి ఎండాకాలమంతా వాడికి దారం తీస్తారు. ఇంటిలో ఆడవాళ్ళు ఈ దారపు 'కండె'లను చీరలు, పంచెలుగా నెయ్యటానికి నాయిబ్రాహ్మణులకు ఇస్తారు. మా ఊర్లో 'మంగలి'వాళ్ళే నేసేవారు. చీర పదహారు మూరలు, పంచె పన్నెండు మూరలు ఉండాల్సిందే. ముతక నేత అంటే మగ్గంలో కాకుండా చేత్తోనే నేసేవారు. అందుకే బాగా బరువుండేవి చీరలు. నేటితరం సుకుమార కన్యలు ఈ చీరలు మోయటం కష్టం.

(ఇంకా ఉంది)





# ఎలక్ట్రాన్

## గ్రహణం పట్టిన మనిషి

మనజీవితం మనదేననుకోవడం భ్రమమాత్రమే! సమాజంలోని వ్యక్తావ్యక్తమైన లేదా దృశ్యాదృశ్యమైన అనేకమైన అంశాలు, శక్తులు మన మన జీవితాల్ని నిర్దేశిస్తాయి. అవి కొంతమంది జీవితాలకి తాత్కాలిక గ్రహణాలు కలిగిస్తే, మరికొంతమందికి శాశ్వత గ్రహణాలు కలిగిస్తాయి. తేనెపూసిన కత్తులు సృష్టించే సంక్షోభాలకి కోణాలనేకం.

తల్లి మరణించిన కారణంగా రామేశం నెలరోజులు సెలవుమీద తన ఊరెళ్లి, అంత్యక్రియలూ, అంతిమ సంస్కారాలూ అవీ అప్పులుచేసి తన శక్తిమేరకు ముగించి, ఆ సోమవారం ఆఫీసుకి అలవాటు ప్రకారం అరగంట ముందుగానే చేరుకొన్నాడు. తను పనిచేసే బల్లమీది దుమ్ముని ఓ పాతగుడ్డతో తుడుచుకొని, కుర్చీలో స్థిరపడ్డాడు. అంతలోనే ఆఫీసు అటెండరు స్వామి వచ్చి, "సర్! కొత్తమ్మగారు మిమ్మల్ని రాగానే వచ్చి కలవమన్నారు," అన్నాడు.

"కొత్తమ్మగారా? ఏమిటి నువ్వంటోన్నది?" రామేశం ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"సర్! మీరు సెలవుపెట్టి వెళ్ళిన వారం రోజుల్లోనే మూర్తి పెద్దయ్యగారికి ఉన్నట్టుండి బదిలీ ఉత్తర్వులు వచ్చేశాయి. వీడ్కోలు సభా, అల్పాహారవిందూ అవీ ఏర్పాటు చెయ్యడానికి అవకాశమివ్వకుండానే, అదేరోజు మధ్యాహ్నం శర్మా చిన్నయ్యగారికి ఛార్జి అప్పగించి వెళ్ళిపోయారు. అయితే శర్మగారికి అధికారం చెలాయించే అవకాశం లేకుండా, ఆ మర్నాడు ఉదయమే వచ్చి చేరిన వసంతమ్మగారు ఛార్జి పుచ్చేసుకొన్నారు."

"సంతాప సందేశాలు పంపారు. పన్నెండోరోజున కొంతమంది సెలవు పెట్టుకొని మా ఊరొచ్చి పరామర్శచేసి వెళ్లారు. అయినా ఈ సంగతి గురించి నాకెవరూ చెప్పలేదే!" రామేశం తనలో అనుకొన్నట్టుగా అన్నా, ఆ మాటలు స్వామికి వినబడ్డాయి.

స్వామి బదులు పలకలేదు.

"సరే! అమ్మగారు రాగానే చెప్పు. వెళ్ళి పరిచయం చేసుకొంటాను."

"ఆవిడ ఉదయం తొమ్మిదింటికే ఆఫీసుకొచ్చేస్తున్నారు. యిప్పుడు తమ గదిలోనే ఏవో కాయితాలు చూసుకొంటున్నారు. యిప్పుడే వెళ్ళి పరిచయం చేసుకొంటే మంచిది."

రామేశం ఒక్కఉదుటున లేచి, వరండా మలుపు తిరిగి, ఆఖరి గది తలుపుమీద తట్టి లోపలికి ప్రవేశించాడు. వసంతమ్మ రూపురేఖలు పరిశీలించకముందే , "నమస్కారం మేడమ్! నా పేరు రామేశం. మీరు మూర్తిగారి స్థానంలో బదిలీ మీద వచ్చారని స్వామి యిప్పుడే చెప్పాడు. ఈ ఆఫీసుకి స్వాగతం!" అన్నాడు.

"కూర్చోండి. ఈ ఆఫీసులో సమయానికి అరగంట ముందే వచ్చే ఉద్యోగుల్లో తానూ, మీరేనని స్వామి నాకు వచ్చిన రోజునే చెప్పాడు! బహుశా ఇప్పుడు నేను మూడోవ్యక్తిని కావొచ్చు!" వసంతమ్మ మాట తీరు రామేశానికి ఆహ్లాదకరంగా వినిపించింది.

బల్లకివలి కుర్చీలో కూర్చుని ఈ మారు ఆమెను శ్రద్ధగా పరిశీలించాడు. బొద్దయిన చామనచాయ శరీరం. నుదుటున చెలామణిలోంచి అదృశ్యమైపోయిన పావ-

లాకాసంతతటి ఎర్రటి స్టిక్కర్ బొట్టు. మెడలో ఒంటిపేట బంగారపు గొలుసు. నల్లటి జుట్టులోంచి తెల్లటి నెరిసిన చారలు స్పష్టంగా కనబడుతున్నాయి. మొత్తానికి మనిషి చాలా హుందాగా ఉందనిపించింది రామేశానికి.

"మీకు కొన్ని విషయాలు తెలియజేయడం ఉద్యోగధర్మం కాకపోయినా, వ్యక్తిగతమైన స్థాయిలోమట్టుకు నా కర్తవ్యంగా భావిస్తున్నాను. మూర్తిగారి బదిలీ శాఖాపరమైన అంతర నిఘా విభాగం వ్యక్తం చేసిన కొన్ని అనుమానాలవల్ల అర్థాంతరంగా జరిగింది. జనాలవద్దనుంచి వచ్చే దరఖాస్తులు, వినతిపత్రాలూ అధికంగా మీరు విశ్లేషించి, పైకి దస్త్రాలు పంపుతారని, ఆయన అనుమతులు జారీ చేస్తారని వారి నివేదికలో పేర్కొనడం జరిగింది. ఇప్పుడు నిఘా విభాగంవారు మీ పేరుని ఆయన పేరుతో జోడించేశారు. ఇది మీకు ఇబ్బందికరంగా మారవచ్చునేమో?" వసంతమ్మ నేరుగా విషయంలోకి వచ్చేసింది.

"నా జీవితం తెరిచిన పుస్తకం. వచ్చిన కాయితల్ని నియమాలప్రకారం నిష్పక్షపాతంగా పరిశీలించి, నా విభాగపు అధిపతికి అందజేస్తాను. అర్హత పరీక్షలు రాసి పాసైనా, అయిదేళ్ళ నిరీక్షణ తర్వాత దొరికిన ఉద్యోగం. ఈ ఉద్యోగం నాకు చాలా అవసరం. నా నిజాయితిని కాపాడుకొంటూ ఉద్యోగం చేస్తున్నాను. ఆఫీసులో జరిగే అక్రమాలకి అందరూ బాధ్యులే అంటే నా దగ్గర సమాధానం లేదు. దేశంలో అవినీతి పెరిగింది కదా అని, దేశం వదిలి వెళ్లిపోలేము కదా, మేడమ్?"

"అవినీతి, అవినీతి అంటూ దారినపోయే ఏ దానయ్యలు అరిచినా, నిజాయితీపరులు తమ నిజాయితీని ఋజువు చేసుకోవాల్సిన పరిస్థితి. అవినీతి పరులు సాధారణంగా చాలా జాగ్రత్తగా ఉంటూ, పెద్దమనుషుల్లా ముసుగులు వేసుకొంటారు. భాండం బ్రద్దలైతేనేకాని వారి గుట్టు సాధారణంగా బయటికి రాదు. నిఘా విభాగాలవారికి కొన్ని సూత్రాలుంటాయి. తాహతుకు మించి జీవించేవారూ, వ్యసన పరులూ, కుటుంబ పోషణ భారమై తరుచూ ఋణాలు చేపట్టే వారూ లంచాలకి లొంగిపోతారని ఒక సిద్ధాంతం. ఒక నమ్మిక. నిఘా విభాగం ఈ దృష్టికోణంలో ఉద్యోగుల్ని రహస్యంగా పరిశీలిస్తూ ఉంటుంది. లేదా ఎవరైనా ఉప్పందిస్తూ ఉంటారు.

"ఇక పోతే మీ తండ్రిగారు కార్గిల్ యుద్ధంలో పోయారు. మీ తల్లిగారు, సైన్యమిచ్చే పించనుకు కాయకష్టం చేసి సంపాదించిన సొమ్ములు జోడించి, తన నలుగురు సంతానాన్ని పెంచింది. మీకు ఇక్కడకి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న స్వగ్రామంలో పాతబడిపోయిన రెండుగదుల ఇల్లు ఉంది. ఒక ఎకరం భూమి ఉంది. మీ అమ్మగారికీ తన అంత్యక్రియల్ని అక్కడే జరిపించాలని కోరికగా ఉండేదట. అందుకని మీరు మీ ఊరెళ్లి ఆమె అభిమతం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి మాట నిలబెట్టుకొన్నారు."

"నా గురించి వివరాలు బాగానే సేకరించినట్లున్నారు?"

"కాయితాలద్వారా కాదు. స్వామి కథనం ద్వారా తెలిసింది. ఇద్దరప్పగార్లకి ఊరి దేవాలయంలో వివాహాలు జరిపించారు. కులాంతరమైనందుకు మీ అమ్మగారు గోలపెట్టినా, ఎలాగో సర్దుకొన్నారు. పెద్దక్క పెళ్ళికి పొలం తాకట్టు పెట్టారు. రెండో అక్క పెళ్ళికి ఇల్లు తాకట్టు పెట్టారు. అందులో మీ దూరపు బంధువు ఒకాయన ఉంటూ అద్దె చెల్లించటల్లేదట. అతికష్టం మీద మీయింట్లోనే మీఅమ్మగారి అంతిమసంస్కారాలకి ఒప్పుకున్నాడట! ఇది నిజంగా చాలా దారుణమైన సంగతి. మీ అమ్మగారి మరణంతో ఇప్పుడు ఇంట్లో పెద్ద ఆడదిక్కు లేదు. పెళ్ళికి ఇంకా ఓ చెల్లాయి ఉంది. పదో తరగతి చదువుతోంది. మీరు ఇంకా బ్రహ్మచారిగానే ఉండిపోయారు!"

"తప్పదు. చెల్లాయి జీవితంలో

స్థిరపడేవరకూ, నా వివాహవిషయమై ఆలోచించ దల్చుకోలేదు! సరే, మీరు చెప్పిన నిఘా సూత్రాలకి అనుగుణంగా, నా పేదరికం నా చేత లంచావతారం ఎత్తించిందన్న ఓ అనుమానం నిఘా విభాగం వారి బుర్రల్లో మొలకెత్తిందన్నమాట?"

"మీరన్నమాట సత్యదూరం కాదు. కానైతే పది శాతం అనుమానం, తొంభైశాతం మూర్తిగారు మిమ్మల్ని ఇరికించడానికి చేసిన ప్రయత్నం. ఇదంతా చాపకింద నీరులా జరిగి పోయిన తతంగమని నా అభిప్రాయం."

"మూర్తిగారికి బదిలీ ఉత్తర్వులిచ్చిందెవరు? వీడ్కోలు పొగడ్తలందుకోకుండానే పరుగు పెట్టింది అందుకేనా?"

"బదిలీ ఉత్తర్వులిచ్చింది మన సంస్థ మానవవనరుల శాఖ అధినేత. చెడ్డపేరుని తీసుకొచ్చే వ్యక్తుల్ని ఏ సంస్థయినా సాధ్యమైనంతవరకు అంతర్గతమైన విచారణ జరిపించి మరుగున ఉంచడానికే ప్రయత్నిస్తుంది. మొదటి మెట్టుగా, ఉన్న ఆఫీసునుంచి మరోచోటుకీ బదిలీ చేస్తుంది. ఒకటి, సంస్థ పేరు కాపాడుకోవడానికి. రెండు, అనుమానితుడిని ఉన్నచోటనే ఉంచేస్తే, కాయితాల్ని తారుమారు చేసే లేదా ధ్వంసం చేసే అవకాశం లేకుండా ఉంటుందని. మరో కారణం కూడా చెప్పుకోవచ్చు. ఒకవేళ మహాధినేత కూడా వాటాల అంత్యదేవత అయితే వ్యవహారం తన దాకా రాకుండా చర్మం కాపాడుకోవాలి కదా?"

"అంటే, మన సంస్థ అధినేతని కూడా మీరు శంకిస్తున్నారా?"

"లేదు. ఇంతవరకూ ఆయనమీద ఏ విషయంలోనూ ఎటువంటి నేరారోపణలూ రాలేదుమరి! కేవలం ఉదాహరణ కోసమని చెప్పానంతే."

"నా జీవితాన్ని గురించి మీకు పూర్తిగా తెలిసి పోయింది కదా? నేను దోచుకొన్నది, దాచు కొన్నది ఏమీ లేదు! విచారణ జరిగితే నిర్భీతిగా ఎదుర్కొంటాను."

"దోచింది దాచుకొంటూనే, పేదజీవితాన్ని ప్రజలముందుంచే అతి తెలివి పరులు కూడా ఉంటారు. పదవీ విరమణ తర్వాత ఇక్కట్లు లేని జీవితం కోసం కొంతమంది పంథా ఇలానే ఉంటుంది."

"అంటే నా నిజాయితీ మీద మీకు నమ్మకం లేదనిపిస్తోంది!"

"లోకరీతిని గురించి, జనాభిప్రాయం గురించి ఆ మాటనన్నానే కానీ, మీ పట్ల అది నా అభిప్రాయమని చెప్పలేదు. స్వామి చెప్పిన కథనం నిజమేనన్న ప్రాతిపదికమీద మీతో మాట్లాడ్డానికి సాహసించాను. విచారణ సంఘం రాక ముందే నేను మీకు ఉప్పందించినట్లయింది కదా?"

"నా జాగ్రత్తల్లో ఉండమని హెచ్చరిస్తున్నారనిపిస్తోంది."

"ఒకటి, మిమ్మల్ని మీరు నిర్దోషిగా సులువుగా నిరూపించుకోవచ్చు. అలా సాధ్యంకాని పక్షంలో అసలు దోషులను పట్టిస్తే కానీ మీ నిర్దోషిత్వం నిరూపణ కాదు కదా? అందుకని సాక్ష్యాధారాలు ఏమైనా ఉంటే జాగ్రత్త పరుచుకోమని సలహా ఇస్తున్నాను."

"మీకు మన సంస్థ అధ్యక్షులవారి మీద ఎలాంటి నమ్మకముందో, నాకూ మూర్తిగారిమీద ఇంతవరకూ అలాంటి నమ్మకమే ఉండేది. ఒకసారి నా బల్ల దాటిన తర్వాత ఏ దస్త్రమూ నా వద్దకు తిరిగి రాదు. ఆ దస్త్రం మీద జరిగిన అంతిమ నిర్ణయమూ నాకు తెలియదు. ఈ ఆఫీసులోనూ ముడుపుల భాగోతం జరుగుతోందని మీరు చెప్పిన తర్వాతే ఇప్పుడే తెలిసిందని చెబ్తే ఎవరూ నమ్మరు. పెద్దాయనకీ నాకూ మధ్య మరో ముగ్గురు ఉద్యోగులు స్థాయీప్రకారం ఉన్నారు. ఎవరి కంచెలు లేదా పరిధులు వారికుంటాయి కాబోలు. ఏ కంచె ఎంతమేస్తుందో, ఇక్కడి కంచెలు దాటి కేంద్రాధికారులకి ఎంత వెళ్తుందో నాకు తెలియదు. ఇప్పుడే, మీరు నిఘా శాఖవారి నివేదిక గురించిన వివరాలు చూచాయగా చెప్పిన తర్వాత కూడా, మూర్తిగారటువంటి వారంటే నమ్మలేకపోతున్నాను. నేనటువంటి వాణ్ని కాదని నెత్తీ నోరూ బాదుకొని ఒట్లు వేయడం, తెరలు లేని నా జీవితం గురించి

మరింత తేటతెల్లంగా చెప్పుకో-వడం తప్ప, వేరే సాక్ష్యాధారాలు నేను చూపించ లేను!"

"మీ మీద అనుమానాలు వ్య-క్తపరచబడ్డాయన్న సంగతి ప్ర-స్తుతానికి మీకూ, నాకూ తప్ప ఇక్కడ ఎవరికీ తెలియదు. ఆఖరికి స్వామికి కూడా. అందరి వివరాలూ కనుక్కున్నట్టుగా, మీ గురించి కూడా స్వామి వద్దనుం-చి కొంత తెలుసు కొన్నాను. పీర్ అస్సెస్మెంట్ అనే విషయాన్ని గురించి వినే ఉంటారు. అధి-కారుల నివేదికలకన్నా, సాటి లేదా దిగువ ఉద్యోగుల అభి-ప్రాయాలకికూడా ఇటీవల పదో-న్నతుల విషయంలో విలువని-స్తున్నారు. స్వామి కథనం విన్న తర్వాత ముడుపుల విషయంలో మీ ప్రమేయం లేదన్న నమ్మకం నాకు కలుగుతోంది. ఈ రోజు కొ-ద్దిపాటి పరిచయాన్ని ఆధారంగా తీసుకొని, నేను ఏకపక్ష నిర్ణ-యంగా మీ వెనక నిలబడలేను కానీ, అతి త్వరలోనే జరగబో-యే విచారణ సమయంలో మీ స్థితిగతుల గురించి, నియమ-పాలనగురించి, సమయపాలన గురించి నేను తెలుసుకొన్న వివ-రాల్ని చెప్పడానికి సంకోచించను. నిశ్చింతగా ఉండండి. అందరూ వచ్చే వేళయింది. వెళ్ళి మీ పని చూసుకోండి." వసంతమ్మ శుభం పలికి రామేశాన్ని బయటకి పంపింది.

రామేశం తిరిగి పోయి తన కుర్చీలో కూర్చున్నాడు. చేయడా-నికి పనేమీ లేదు. తను సెలవు-మీద పోయినప్పుడు తన పనిని శేషాచలానికి అప్పగించారట. శేషాచలం బల్లమీద ఏవో దస్త్రా-లు పడి ఉన్నాయి.

"తాము చెప్పేవరకూ, వచ్చే జనాల దరఖాస్తులను నీకు ఇవ్వొద్దని మన పై బాస్ మంగపతి మహో-దయుడు ఆజ్ఞ జారీ చేశాడు. బహుశా నిన్ను బదిలీ చేసే ఆలో-చనలో ఉన్నారనుకొంటాను!" అన్నాడు శేషాచలం.

"చెల్లాయి పదో తరగతి చదువు-తోంది. అమ్మ పోయిన కారణంగా ఇప్పుడు బదిలీ అంటే ఇబ్బందే!" శేషాచలం ఓ సారి తల విదిల్చి,"-మంగపతిగారిని రాగానే అడుగు. ఆయన నాలుగు రోజుల సెలవు మీద తిరుపతి మొక్కు తీర్చుకో-డానికి పోయాడు. అంతవరకు కాస్త ఊపిరి పీల్చుకో. బీటలువా-రిన భూములు నీళ్లులేని వాగుల పొంగుల్లో ముంపుకు గురైయ్యా-యని రాజకీయ దళారులచే ప్రేరేపింపబడిన ప్రజల అర్జీల-కు కొదవ లేనంత కాలం పనికి లోటుండదు!" అని తన పనిలో తాను మునిగి పోయాడు.

నిఘా విభాగంవారు సమకూ-ర్చిన విచారణ సంఘం రహస్య విచారణ చేబట్టింది. ఒక విశ్రాంత న్యాయాధికారి, కంపెనీ నిఘాసం-స్థ అధికారి సమక్షంలో వసంత-మ్మ, రామేశం గురించి తను అతి దిగువస్థాయి ఉద్యోగి స్వామి ద్వారా తెలుసుకున్న వివరాల్ని స్వామి ప్రసక్తి తీసుకురాకుండా ప్రస్తావిం-చి, రామేశానికి మంచి కితాబుని-చ్చింది. రామేశం తనగోడు తాను వినిపించుకొన్నాడు.

విచారణ సంఘం పలువురిని పిలిచి ప్రశ్నించింది. వారందరూ మాటలు నానుస్తూ రామేశానికి వ్యతిరేకంగా ఏమి చెప్పకపోయి-నా, పెద్దాయనకే మద్దతునిచ్చా-రు. ఎందుకంటే అవినీతి తీర్థం పుచ్చుకొనేవాళ్లు వాళ్ళలో గణ-నీయంగానే ఉన్నారు. చివరికి విచారణ సంఘం స్వామిని లోనికి పిలిచింది.

స్వామి విచారణ సంఘం అడిగిన ప్రశ్నలకి జంకులేకుండా సమా-ధానాలిచ్చాడు. "రామేశంగారి-కి నియమాలు బాగా తెలుసు. అర్జీలలోని లొసుగులు కనిబె-ట్టి, తానే మార్గాలు తెలియచేసి, వసూళ్లు దండుకొని కాయితా-లని ముందుకు పంపేవాడు. ఇలాదండుకొన్న సొమ్ముల్ని అలా అప్పులు తీర్చడంతోనే సరిపో-యేది ఆయనకి!" స్వామి కల్ల-మాటల ఇటుకల్తో గోడకట్టినట్టు సాక్ష్యం చెప్పాడు.

కేంద్రంలో విడిగా విచారణ జరి-గినప్పుడు, "రామేశం గొప్ప పరి-శీలనా శక్తికలవాడు. అతని ద్వారా ఏ దస్త్రం వచ్చినా కళ్లుమూసుకొ-ని సంతకాలు చేసేటంతటి

( 48 వ పేజీ చూడండి)

# భువనచంద్ర



# జ్ఞాన ఫలం

"మనిషి పుటుక పుట్టింది ఎందుకో తెలుసా? వాడిని కొట్టో వీడిని గెల్చో డబ్బు సంపాయించి దాన్ని లెక్కపెట్టుకోవడానికి కాదు. పదవులూ బిరుదులూ సంపాయించి మంది మాగధుల చేత పొగిడించికోవడానికి కాదు. కోట్లకొద్దీ ఆస్తులు కూడబెట్టి కొడుకులూ కూతుళ్ళూ మనవలూ మునిమనవలకోసం వీలునామా రాసి చావడం కోసం కాదు. కేవలం తనని తాను తెలుసుకోవడానికి" ఉపన్యాసం అద్భుతంగా ఇస్తున్నారు సుందర నారాయణగారు.

సుందరనారాయణగారు పూర్వాశ్రమంలో సైంటిస్టు. అమెరికా ఆస్ట్రేలియా యూరపులో ఎన్నో సెమినార్లలో పాల్గొని పేరు తెచ్చుకున్నవారు. కనీసం పది యూనివర్సిటీలు ఆయనకు గౌరవ డాక్టరేట్లు ఇచ్చాయి.

"ఇంతకీ పుట్టింది తనని తాను తెలుసుకోవడానికంటారు. మరి ఆ తెలుసుకోవాలంటే మడిసనేవోడు బతికుండాల గదా. మరి బతకాలంటే ఏదో ఒకటి సంపాయించాల గదా. సంపాయించాలంటే కష్టపడాల గదా. అయినా ఎలా తెలుసుకోవాలో చెప్పండి" వరసపెట్టాడు బాలవర్ధిరాజుగారు.

సుందరనారాయణ గారు పకపకా నవ్వి, "బాలవర్ధీ నువ్వేం మారలేదురా... అయ్యా! రాజుగార్ని 'రా' అంటున్నానని ఏమీ అనుకోకండి. మేమిద్దరం క్లాసుమేట్సుమి. కలిసే చదువుకున్నాం. ఇంతకీ తెలుసుకోవాల్సింది ఏమంటే, నేను ఎక్కడ నుంచి ఇక్కడికి అంటే, యీ భూలోకానికి వచ్చాను? ఏం చెయ్యడానికి వచ్చాను? ఇక్కడ ఎంత కాలం వుంటాను? ఇక్కడినించి మళ్ళీ ఎక్కడకు వెడతాను? అనే నాలుగు విషయాల్ని. అది తెలిస్తే చాలు...యీ ప్రకృతీ, యీ జీవరాసులూ, యీ సృష్టిక్రమం అన్నీ అర్థమావుతాయి" అన్నారు.

ఆ తరవాత 'నేను ఎవరూ?' అన్న ప్రశ్న వేసుకుని నిన్ను నీవే తెలుసుకో అన్న రమణమహర్షి గురించీ, తనని తాను తెలుసుకున్న రామకృష్ణ పరమహంస మొదలైన మహానుభావుల గురించీ చక్కగా ఓపిగ్గా అందరికీ అర్థమయ్యేట్టు వివరించారు సుందరనారాయణ గారు.

"అసలు యీ విషయాల గురించి తెలిసినందువల్ల ప్రయోజనం ఏమిటీ?" అడిగాడో పక్కూరి మనిషి.

"అయ్యా, ఒక వ్యక్తి చనిపోయాక, 'బాబూ మహాపర్వతాలూ మహాసముద్రాలూ మహాద్భుతమైన ప్రకృతి, ఖనిజాలూ సర్వం కలిగిన ఈ భూమండలాన్నే కాదు, నవగ్రహాలనీ కోటానుకోట్ల తారలు కలిగిన యీ విశ్వాన్నే నీకు రాసిఇచ్చేస్తాం.... ఒక్కసారి కళ్ళు తేరు' అని ఎంత మొత్తుకున్నా ఆ శవం కళ్ళు తెరవగలదా? అంటే, ఒక్క క్షణపు మీ బ్రతుకు విలువ యీ సమస్త విశ్వం కంటే ఎంతో విలువైనది! ఎంతో గొప్పది! అది తెలుసుకోకుండా, నాలుగు డబ్బులకోసం నానా పాట్లూ పడుతూ నానా మోసాలకీ పాలుపడటం మంచిదేనా? పోనీ ఎంత కూడబెట్టినా అన్నీ ఇక్కడ వదిలిపోవాల్సిందేగా. తీసుకు వెళ్ళలేనిదాన్ని అసలు జీవితాంతం పోగుచేస్తూ కాలాన్ని వ్యర్థం చేయడం ఎందుకూ?" ప్రశ్నించారు సుందరనారాయణ గారు. సభ సైలెంటయ్యింది. నిజమేగా.

"మీరన్నది ముమ్మాటికీ నిజం స్వామీ... మా తోడల్లుడు కొన్ని కోట్లు గడించాడు. వారం క్రితం రాత్రికి రాత్రే హార్టె-

టాక్ తో పోయాడు. ఆ డబ్బు ఎక్కడ దాచాడో పెళ్ళానికి కూడా చెప్పలేదట. చూడండి, తను సంపాయించింది తనూ అనుభవించలా... పెళ్ళాం పిల్లల్నీ అనుభవించనివ్వలా... ఎందుకు పోగేసినట్టూ!" నిట్టూర్చి అన్నారు కృష్ణమూర్తి మాస్టారు. ఆయనకీ నలభై ఏళ్ళు. హైస్కూలులో పనిచేస్తున్నారు.

"మా చుట్టాలబ్బాయిదైతే ఇంకా ఘోరం. అమెరికాలో చదివాడు. అక్కడే నెలకి అయిదు లక్షలో ఆరు లక్షలో ఉద్యోగం కూడా సంపాయించుకున్నాడు. ఆరోజు రోడ్డుమీదకొస్తే ట్రక్కు ఎదో గుద్దిందట. క్షణాల్లో పోయాడు. అమెరికాకి అప్పుచేసి వెళ్ళాల్సొచ్చింది. తల్లిదండ్రులకి" బాధగా అన్నాడు ముత్తయ్య.

"అందుకే చెబుతున్నాను. అనిశ్చయమైన, అశాశ్వతమైన దాన్ని గురించి కాదు తెలుసుకోవలసింది. శాశ్వతమైన ఆత్మ గురించి" అన్నారు సుందరనారాయణ. కొందరు విన్నారు. కొందరు, 'హూ! చచ్చాక వెళ్ళిపోయే ఆత్మ గురించి బతికుండే సమయంలో ఎందుకూ విచారించడం' అంటూ గొణుక్కున్నారు. మరికొందరు ప్రసాదం కోసం వచ్చిన భక్తులు నిద్రావస్థనించి బయటికొచ్చి, ప్రసాద వితరణ మొదలు కాలేదని తెలుసుకుని మళ్ళీ నిద్రలోకి జారుకున్నారు.

ఓ కుర్రాడు మాత్రం దూరంగా కూర్చుని ఇవన్నీ శ్రద్ధగా వింటున్నాడు. అతనెప్పుడూ ఒకే నిక్కరూ ఒకే షర్టుతో కనిపిస్తాడు. చాలా శ్రద్ధగా వింటాడు అనే విషయాన్ని సుందరనారాయణ గారు ప్రవచనం మొదలుపెట్టిన దగ్గర్నుంచీ గమనిస్తూనే వున్నారు.

"అయినా నారాయణా, నీకు ఆస్థి వుంది. చదువుంది. జీవితంలో ఏ కొదవా లేదు. ఆత్మా విద్యవైపు బోలెడంత కాలం నీ దృష్టిని మళ్ళించవచ్చు. ఏమీ లేనివాడికీ బోధలవల్ల ఉపయోగం ఏమిటీ?" కొంచెం పదునుగానే అడిగారు బాలవర్ధిరాజు.

"నువ్వు అన్నమాటలన్నీ నిజమే. నేను చెబుతున్నది ఆధ్యాత్మిక ఆసక్తి వున్నవారికోసం మాత్రమే. ఎందుకంటే ఇదేమీ ఉద్యోగం కోసం పనికివచ్చే విద్య కాదు. దీనిలో డిగ్రీలు ఏమీ వుండవు. ఒక్కటి మాత్రం నిజం... యీ లోకంలో దేన్నైనా తట్టుకునే బలమూ శక్తీ మాత్రం కలుగుతాయి. 'అన్నీ వదిలేసి వెళ్ళిపోతాం' అనే ఎరుక వున్నప్పుడు అనవసరమైనవాటి కోసం పడే తాపత్రయం తగ్గి ఆత్మానందమూ సంతృప్తీ కలుగుతాయి. దానికి ప్రత్యక్ష సాక్ష్యం నేనే. ఒకప్పుడు ఉద్యోగం కోసం, పేరు కోసం డబ్బు కోసం వెంపర్లాడాను. నా దృష్టి ఇటువైపు మళ్ళాక మాత్రమే నాకు తృప్తీ ఆనందమూ దొరికాయి" స్పష్టంగా అన్నారు సుందరనారాయణ. గుడిలో ప్రసాద వితరణ ప్రారంభం అయింది. భక్తులందరూ లేచి వరుసల్లో కూర్చున్నారు.

*******

నేలఉసిరి ఆకులకోసం ఊరికి దగ్గరలో వున్న చిన్నపాటి అడవికి వచ్చారు సుందర నారాయణ. ఆ రసాన్ని మందుగా ఇస్తే పచ్చ కామెర్లు తగ్గుతాయి. నడుస్తూపోతుంటే ఓ కుర్రాడి గొంతు వినిపించి అటువైపు వెళ్ళారు. దూరంగా ఓ చెట్టు కింద వున్న రాయిమీద తను రోజూ చూసే కుర్రాడు అచ్చు తనలాగే ఆధ్యాత్మిక విషయాలు అతని భాషలో చెబుతూంటే మిగతా పది పన్నెండు మంది కుర్రాళ్ళూ, వృద్ధులూ ఆ మాటలు వింటున్నారు. వారికి కనపడకుండా కొంచెం దగ్గరికెళ్ళి ఆ కుర్రాడు చెప్పేది వినడం మొదలెట్టారు. ప్రతిరోజూ తను 'ప్రవచనం'లో చెప్పేదే ఆతను మరింత తేలిక భాషలో తనవాళ్ళకి చెప్తున్నాడు.

అంతా అయ్యేదాకా అక్కడే నిలబడి విన్నారు సుందర నారాయణ. అందరూ లేచాక, అతనివైపు నడిచారు. ఆ కుర్రాడూ సుందర నారాయణని చూసి సాష్టాంగపడ్డాడు.

"ఆయుష్మాన్ భవ. లే నాయనా" అన్నారు సుందరనారాయణ. "అవునూ రోజూ ఇలాగే చెబుతున్నావా?" అన్నారు నవ్వుతూ.

"క్షమించండి స్వామీ. మా అందరిలోనూ నేనే కాస్త అయిదో తరగతి దాకా చదివినవాణ్ని.

మేమందరం పశువులు కాసే-వాళ్ళం. నేను అక్కడికొచ్చినపు-డు నా గొడ్లని కూడా వీళ్ళే కాపలా కాస్తారు. మీరు చెప్పినవన్నీ విని, నేను వీళ్ళకి చెబుతూవుంటాను. అయ్యా, నిజంగా మీరు చెప్పేవి గొప్ప విషయాలు. కులం మతం తేడాలు లేకుండా అవి అందరికీ సంబంధించిన విషయాలు. వి-న్నప్పుడూ, వీళ్ళకి చెబుతున్నప్పు-డూ కూడా నాకు ఎంతో ఆనందం కలుగుతుంది" సుందర నారా-యణతో అన్నాడా యువకుడు.

"చాలా మంచిపని చేస్తు-న్నావు బాబూ" ఆ కుర్రాడి భుజం తట్టి ముందుకెళ్ళారు సుందర నారాయణ.

*********

"ఈ కుర్రాడ్ని నా పక్కనే కూర్చో-పెట్టుకుని ఉపన్యాసం మొదలె-డుతున్నానని అనుకుంటున్నారా" కారణం వుంది. ప్రతి రోజూ నేను చెప్పేది వింటున్నాడు. విన్నది మరో పదిహేను మందికి చక్కని సులభమైన భాషలో వివరించి చెబుతున్నాడు. జీవితంలో అత్యంత ఆనందం అనుభవిం-చింది నిన్నటిరోజున. ఇందులో ఆనందపడటానికి ఏముందం-టారా? ఉంది. మనలో ప్రతివారికీ ఏదో ఓ ప్రత్యేకత వుంది. బాలవ-ర్ధిరాజు గొప్ప వ్యవసాయదారుడు. గజం నెల ఇచ్చినా ఏదో ఓ పంట పండిస్తాడే గానీ ఖాళీగా వదలడు. మీరూ అలాంటి ప్రజ్ఞావంతులే. కానీ యీ కుర్రాడు తను నేర్చు-




కున్నది తన దగ్గరే దాచుకోవ-డంలా. ఏరోజుకారోజు పదిమం-దికీ పంచేస్తున్నాడు. జ్ఞానఫలాన్ని పదిమందితోనూ కలిసి పంచు-కుంటున్నాడు. నేను నేర్చింది నా దగ్గర మాత్రమే వుండాలి, దాని-వల్ల వచ్చే లబ్ధి నేను మాత్రమే పొందాలి అని ఆలోచించట్లే-దు. అయ్యా భగవంతుడు మన మనోశక్తి ప్రకారమే విద్యలను అనుగ్రహించాడు.

ఈ కుర్రవాడు, ఇతని తోటివా-ళ్ళు చేసేది పశుపాలన. శ్రీకృష్ణుడు చేసిందీ అదే కదా! నిన్నటి వీరి సమావేశం చూసాక మన పూర్వీ-కులు చెప్పిన శాంతి శ్లోకం గుర్తు-కొచ్చింది. అదేమిటో తెలుసా?

'సహనా వవతు .. సహనౌ భునక్తు సహవీర్యం కరవావ-హై... తేజస్వినావధీతమస్తు మా-విద్విషావహై ఓం శాంతి: శాంతి: శాంతి:' అని.

దానికి అర్థం తెలుసా --

"కలిసి మెలిసి తిరుగుదాం
కలిసి మెలిసి పెరుగుదాం
కలిసి మెలిసి తెలుసుకున్న
తెలివిని పోషించుదాం
కలిసి మెలిసి కలత లేక
చెలిమితో జీవించుదాం" అని.
(భగవాన్ శ్రీ సత్య సాయిబాబా)

ఇది వేదవాక్కు. ఈ కుర్రవాడు పాటిస్తున్నది దాన్నే!

అయ్యా, అలా పంచుకుని చెలిమితో వుండడం వల్ల వచ్చేది శాంతి. శాంతితో బాటు నీడలా వుండేదే సుఖం. అందుకే యీ పిల్లవాడ్ని యీ వేదిక మీద నా దగ్గర కూర్చోబెట్టుకున్నాను. ఇతని మను సారవంతమైన భూమిలాంటిది. అందులో పడ్డ ఏ విత్తనమైనా మహా వృక్షమై తీరుతుంది. స్వస్తి" అన్నారు సుందర నారాయణ.

మీరు నేర్చిన విద్య పదిమందికీ పంచినప్పుడే ఆ విద్యకి నిజమైన ఫలితం లభిస్తుంది. అప్పుడు కలిగే ఆనందం అద్భుతమూ అపురూపమూ.

మళ్ళీ కలుద్దాం
నమస్కృతులతో
భువనచంద్ర

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

**( ఆధారం : స = అసలు అక్షరం 'మ' )**

మసగుక్షే చింకనిపి - మన్టటేకమానసు
మసు జింకనిపి తని - మాఖరసో చచ్చా!

యూసపు కర డర్సను - యేని ముఫస్తై హోయు
కోసపు కర డర్సను - కొజ్జముఫసు
ఏసరి చీబపు ముఫ - సా డర్సై హోయు
ఆసివా రెప్పుట ముఫ - సెట్టని పేకచ్చా!

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

విజాతు లన్నియు - వృధా వృధా
అజామిళాదుల - కది యేజాతి?
1. జాతిభేదములు - శరీర గుణములు
జాతి శరీరము - సరితోడనె చెడు
ఆతుమ పరిశుద్ధం బెప్పుడును - అది నిర్దోషం బనాది
యీతల హరివిజ్ఞానపు దాస్యం - బిది యొక్కటె పో సుజాతి

జనవరి నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ ఎం అప్పారావు, విశాఖ

# కొత్త రామానందం



## సర్వ దేవతా ప్రీతికరం మాఘమాసం

జపం, తపం, దానం, వ్రతం మొదలైనవాటితో కూడా ఆ భగవంతున్ని సంతృప్తిపరచలేమో కానీ .... మాఘమాసంలో కేవలం స్నానం వల్లనే ఆయన ప్రసన్నుడై, భక్తులను సకల పాపాల నుంచీ విముక్తుణ్ణి చేస్తాడని పద్మపురాణం ఉత్తరఖండంలోని మాఘమాస మహాత్మ్యం చెబుతోంది. ది. 5 ఫిబ్రవరి 2019 రోజున మాఘమాసం ప్రారంభమవుతుంది.

శివకేశవులిద్దరికీ ప్రీతికరమైనది మాఘమాసం. మఖ నక్షత్రం పౌర్ణమి తిథినాడు పూర్ణకళలతో చంద్రుడు ఉంటాడు కాబట్టి మాఘమాసం అని పేరొచ్చింది. ఈ మాసంలో విశాయక సర్వ విఘ్ననాశని. మాఘమాసంలో సాధారణంగా సూర్యుడు కుంభరాశిలో సంచరిస్తాడు. సూర్యుని కిరణాలు నేలపై జలాలను తేజోమయంగా మార్చేది మాఘమాసంలోనే. ఈ మాసంలో చేసే నది, సముద్ర స్నానాలు సర్వ పాపహరణాలు. ముక్తిదాయకాలు. అందువల్లనే స్నానానంతరం సూర్య భగవానునికి అర్ఘ్యం సమర్పించడం ఒక ఆచారం.

ఎక్కడయితే పరిశుభ్ర జలం వుంటుందో, ఆ ప్రదేశాలన్నీ స్నాన యోగ్యంగా చెప్పబడ్డాయి. నగరాలలో, రమ్యహర్మ్యాలలో నివసించే నవనాగరీకులకు ఈ స్నానాలు దుర్లభం. అందువల్ల వారికి నిర్దేశించబడిన విధానం ప్రకారం గంగాజలం నిలువ ఉంచుకునేవారు, కొద్దిగా గంగా జలాన్ని స్నానం చేసే నీటిలో కలుపుకోవచ్చు. స్నానానంతరం అర్ఘ్యప్రదానం. దాని తరువాత భగవంతుని ఉద్దేశించి ఒక మంత్రం గాని నామస్మరణ కాని చేసి, పత్రం, ఫలం, తోయం ఏదైనా భక్తితో సమర్పించుకున్నవారికి, ఆ సూర్యభగవానుని అనుగ్రహం వల్ల ఆరోగ్యం, శ్రీమన్నారాయణ మూర్తి అనుగ్రహం వాళ్ళ సకల శుభాలు, సుఖ సంతోషాలు కలుగుతాయి. విశేషించి మఖ నక్షత్రం ఉన్న సమయంలో చేసే ఈ స్నానాలను మహామాఘ స్నానమని భారతదేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఎంతో పవిత్రంగా భావిస్తారు. గంగానదిలో స్నానం చేస్తే అది కురుక్షేత్రస్నాన సమానం అవుతుంది. వింధ్యావాసినిలో చేస్తే పది రెట్లు, కాశీలో చేస్తే నూరు రెట్లు పుణ్యం కలుగుతుందంటారు. ఈ మాసంలో తిలాదానం, సాలిగ్రామ దానం, వేణీ దానం శుభప్రదం.

మాఘ శుద్ధ పంచమి రోజు 'శ్రీ పంచమి'గా ప్రసిద్ధి చెందింది. తెల్లని పుష్పాలతో శ్రీ మహాలక్ష్మిని, మహాసరస్వతిని ఆరాధించాలి. రతీమన్మథ ఆరాధన చేస్తే ప్రశాంత జీవనం కలుగుతుంది. దక్షిణ భారత దేశంలోని సుప్రసిద్ధమైన సరస్వతీ క్షేత్రం బాసర. నిజామాబాద్ కి 35 కి మీ దూరంలో గోదావరీ తీరంలో ఉంది. ఇచ్చటనే వేదవ్యాసుడు సరస్వతీ అమ్మవారిని ప్రతిష్ఠించినట్టు ప్రతీతి. ఇక్కడ జ్ఞాన సరస్వతీదేవి మహాలక్ష్మి, మహాకాళి సమేతురాలై కొలువుతీరి ఉన్నారు. ఈ పుణ్యదినాన అమ్మవారి సమక్షంలో

వేలాది అక్షరాభ్యాసాలు జరుగుతాయి.

మాఘ శుద్ధ సప్తమి రోజు 'రథ సప్తమి'గా పేరుపొందింది. ఈ రోజును సూర్యనారాయణమూర్తి జయంతిగా భావిస్తారు. సప్తాశ్వరథం మీద, అంటే ఏడు గుర్రాలు పూన్చిన రథం మీద సంచరించే భానుడు తన సంచారగతిని మార్చుకునే రోజు ఇది. సూర్యరశ్మిలో వివిధ వర్ణాల కాంతి తీవ్రతతో మార్పు వచ్చి శీతాకాలం నుంచి వసంత, గీష్మ ఋతువుల దిశగా మార్పులు సంభవించే సమయం ఇదే. ఆదిత్యుని పూజ చేయడానికి ఉత్తమమైన మాసం. సూర్యారాధనలో అతి ప్రముఖమైనది ఆదిత్య హృదయ పారాయణం. ఈ మహామంత్రాన్ని అగస్త్యుడు శ్రీరామునికి ఉపదేశించాడు.

జన్మ నుంచి జన్మాంతరం వరకు చేసే శోక రోగరూప పాపాలు మనోవాక్కాయలతో, జ్ఞాన అజ్ఞానాలతో చేసే సప్తవిధా ల పాపాలను నశింపజేసే శక్తి ఈ సప్తమి తిథికి ఉందని శాస్త్ర వచనం. సప్తమి నాడు ఆచరించే సముద్ర స్నానం శ్రేష్టం.

మాఘ శుద్ధ ఏకాదశిని భీష్మ ఏకాదశిగా వ్యవహరిస్తారు. కురువంశ పితామహుడు అయిన భీష్ముడి పేరున భీష్మ ఏకాదశి అని నామకరణం చేశాడు శ్రీకృష్ణుడు. శిఖండిని యుద్ధభూమిలో చూసి అస్త్ర సన్యాసం



చేశాడు భీష్ముడు. అందువల్ల అర్జునునిచే నిశిత శరాలతో బాధింపబడ్డాడు. భీష్ముడు శరతల్ప గతుడై భూమి మీదికి ఒరిగాడు. ఇచ్చామరణ వరం పొంది ఉండటం వల్ల ఉత్తరాయణం వచ్చేవరకు ఎదురు చూశాడు.

శ్రీకృష్ణుని సలహాననుసరించి ధర్మరాజు భీష్ముని దరిజేరి, ఆయనకు నమస్కరించి ధర్మసూక్ష్మాలను నేర్పమన్నాడు. ధర్మరాజు కోరికపై శ్రీకృష్ణ పరమాత్మ సముఖంలో విష్ణు సహస్ర నామ స్తోత్రాన్ని ఉపదేశించాడు భీష్ముడు. ఈ విష్ణు సహస్రనామ పారాయణ చేసినవారందరికీ కామితార్థములు ఈడేరి, అంతమున విష్ణు సాయుజ్యం పొందగలరని సాక్షాత్తు శ్రీ కృష్ణ భగవానుడే చెప్పాడు. అదే విధంగా మాఘ శుద్ధ అష్టమి నాడు భీష్ముడు సిద్ధి పొందాడు. ఆ కారణాన ఈ శుద్ధ ఏకాదశిని భీష్మ ఏకాదశిగా ముకుందుని సలహాపై భక్తులు పరిగణించుచున్నారు.

ఈ విష్ణు ప్రీతికర మాఘమాసంలో వచ్చిన మాసశివరాత్రి మహాశివరాత్రిగా ప్రసిద్ధికెక్కింది. శివారాధనకు మహాశివరాత్రికి మించిన రోజు మరొకటి లేదు. ఆ పర్వదినాన ప్రత్యూష కాలంలో నదిలో కానీ తటాకంలో కానీ స్నానం చేసి అర్ఘ్యప్రదానాదులు అయ్యాక పరమేశ్వరుని పూజించాలి. నదీ జలాలతో,

ఏకాదశ ద్రవ్యాలతో, మహన్యాస పూర్వక రుద్రనమక చమకాదులతో ఏకాదశ రుద్రాభిషేకం శివార్పణంగా చేసి, ఆ తర్వాత బిల్వ పత్రార్చన ప్రియుడైన శంకరుణ్ణి అష్టోత్తర శత నామావలితో పూజించి, ఆ రాత్రంతా భగవంతుని నామ సంకీర్తన గానీ, పారాయణ గానీ, స్తుతి ప్రార్థనలతో గానీ కాలక్షేపం చేయాలి. అమావాస్య స్నానం చేసి, శివునికి పునః పూజ చేయటంతో శివరాత్రి దీక్ష ముగుస్తుంది.




"ఓం నమో భగవతే సూర్యాయ"

## సరస్వతీ నమస్తుభ్యం

అమ్మ ...ఎంత కమ్మని పదం! మనందరినీ కష్టపడి కని, పుట్టిన దగ్గర నుంచి లాలించి, పాలించి, పెంచి విద్యాబుద్ధులను నేర్పిన అమ్మ అందరికీ సదా పూజనీయురాలే. అలాంటి అందరి అమ్మలతో పాటు సర్వులను కన్నా అమ్మ - జగజ్జనని పట్ల మనం కృతజ్ఞతతో చూపవలసిన భక్తికి కొలత ఉందా? సృష్టి చేయడానికి అవసరమైన ఇచ్ఛా శక్తి, జ్ఞాన శక్తి, క్రియా శక్తులను సరస్వతీ దేవే అనుగ్రహిస్తోంది కనుకనే బ్రహ్మ దేవుడు సృష్టి కార్యాన్ని చక్కగా నెరవేరుస్తున్నాడు. అందుకే ఆమె బ్రహ్మదేవునికి భార్య అయ్యింది.

శబ్దమనే జ్యోతి లేకుంటే జగమంతా అంధకార బంధురమే. నాదాత్మకమై, ప్రణవమై అక్షర రూపమై సప్తస్వరలసితమై వ్యక్తీకరణ శక్తియై భాసించే జగదంబ సరస్వతి. వాగ్భూషణం భూషణం అని మనిషికి మంచిమాటే అలంకారమనీ, మాటవల్లే జగత్తు నడుస్తోందనీ, ఆ వాక్కును దేవతగా ఉపాసించి తరింపచేసే వాక్సంపదను సాధించారు మహాఋషులంతా. భారతీ శబ్దం సంబంధం చేత విద్యకు ప్రాధాన్యం, జ్ఞానానికి ప్రామాణ్యం ఇచ్చిన దేశమిది. 'భారతీ భారతానస్మాన్' (భారతీదేవి మమ్ములను భారతులను చేయుగాక) అంటూ శుద్ధత్వం కలిగిన అమ్మను ధ్యానించే శుభవేళ శ్రీ పంచమి.

శ్వేత వస్త్రాలతో అలంకృతమై, హంసవాహినిగా తెల్లటి తామర పుష్పంపై కొలువుతీరిన వీణాపాణిని జ్ఞానానంద పరాశక్తిగా ఆరాధిస్తారు. ఏడు సారస్వత శక్తులతో భారతీదేవి విలసిల్లుతోంది. శ్రద్ధ, ధారణ, మేధ, వాగ్దేవి, విధి, వల్లభా, ఆహ్లాదవదన, శమాది గుణదాయిని అనే సప్త నామధేయాలతో చదువులమ్మ విరాజిల్లుతోంది.

సరస్వతి అంటే వెలుగునిచ్చేది. జ్ఞానమనే కాంతుల్ని మన జీవితాల్లో ప్రసరింపచేసే శక్తే సరస్వతి. లౌకికమైన అపర విద్యలకు, పారమార్థికమైన బ్రహ్మవిద్యకు అధిష్ఠాన దేవత సరస్వతి. సత్వ గుణ శోభితగా భారతి దీప్తిస్తుంది. అమ్మ చెంతన ఉండే హంస - పాలను నీటిని వేరుచేస్తుంది. మంచి చెడుల విచక్షణా జ్ఞానన్నే మనసులుకొమ్మని భారతితన హంస వాహనం ద్వారా సందేశమిస్తుంది. భారతీదేవి హస్త భూషణమైన వీణ, ఆమెను సకల కళల అధిష్ఠాత్రిగా ప్రకటిస్తోంది. అమ్మ చేతిలో ఉండే పాశాంకురాలు మనిషిలోని మనో కాలుష్యాన్ని వారింపచేసే ఆయుధాలు. నిర్మలమైన మనసుతో, ఏకాగ్రతతో, భక్తితో సరస్వతిని ఉపాసిస్తే అమ్మ అనుగ్రహం సత్వరం సిద్ధిస్తుందంటారు.

విద్యాభ్యాస ప్రారంభంలో పిల్లలచేత 'సరస్వతీ నమస్తుభ్యం అంటూ సరస్వతీ పూజ

చేయించడం సంప్రదాయం. సరస్వతీదేవిని పెద్దలుకూడా ఎందుకు ఆరాధించాలో కంచి మహాస్వామిఇలా తెలిపారు. 'సరస్వతీ దేవి అనుగ్రహించే విద్యవల్ల కలిగే జ్ఞానం మన భవ బంధాలను విప్పుతుంది. అప్పుడు భయం, బాధ, శోకం ఉండవు. జీవాత్మ పరమాత్మతో ఐక్యం చెందడమే జీవిత లక్ష్యమనీ, ఈ గమ్యాన్ని గ్రహించడానికే అమ్మను ఆరాధించి విద్యనూ పొందాలనేదే సౌందర్యలహరి చెప్పిన ఫలశ్రుతి.



మాఘ శుద్ధ పంచమి దినాన్ని 'శ్రీ పంచమి' అని పిలుస్తారు. ఆ రోజున ఉన్న ప్రత్యేకతలను బట్టి 'వసంత పంచమి' ఐ 'మదన్ పంచమి' అని పేర్లున్నాయి. ముఖ్యంగా ఈ రోజు ప్రత్యేకత విద్యా ప్రదాత్రి అయిన సరస్వతీదేవి పుట్టినరోజు అని బ్రహ్మ వైవర్త పురాణం చెబుతోంది. ఈరోజున విద్యారంభ దినంగా జరుపుతారు. బెంగాల్ లోనూ, దాని సరిహద్ద రాష్ట్రాలయిన ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలోనూ వైభవోపేతంగా శ్రీ పంచమి జరుపుతారు.

ఈ పుణ్యదినాన సరస్వతీదేవిని పుస్తకాది రూపాలలో విగ్రహంలో ఆవాహన చేసి, పూజిస్తే సర్వాభీష్టాలు లభిస్తాయంటారు. అమ్మవారిని తెల్లని పూలతో పూజించి, క్షీరాన్నం నేతివంటలు, నారికేళ కదలీ ఫలాలు, శుక్లావస్త్రాలు, శుక్లచందనం నివేదించాలి.

చైత్ర మాసారంభంతో వసంత ఋతువు ప్రారంభం అవుతుంది. రాబోయే వసంత ఋతువును స్వాగతించే దినంగా దీన్ని చెబుతారు. రాజస్థాన్ ప్రాంతంలో ఈరోజున జరిపే వసంతోత్సవం ప్రత్యేకత సంతరించుకుంటుంది. వసంతాగమనానికి స్వాగత సూచకంగా వీరు వసంతాన్ని, ఇతర రంగునీళ్ళను బుక్క, బర్గుండ లాంటి రంగు పొడులను ఒకరిపై ఒకరు చల్లుకుంటారు. హరిద్వార్, హృషీకేష్, ప్రయాగ వంటి పుణ్య దేవాలయాల ఆధ్వర్యంలో శ్రీపంచమి ఉత్సవాలు, మేళాలు జరుపుతారు. అక్కడ ఈరోజున పూజలు చేసేవారంతా పసుపుపచ్చని బట్టలు ధరిస్తారు. శ్రీపంచమినే రతికామదమనోత్సవంగా వ్యవహరిస్తారు. మాఘ శుక్ల పంచమినాడు రతీదేవి కామదేవ పూజ చేసినట్లు పౌరాణికులు చెబుతారు. శ్రీరామరాజ్యోత్సవ పర్వంగా శ్రీ పంచమి ప్రసిద్ధం. శ్రీరాముడు చైత్ర శుద్ధ విదియనాడు విభీషణునికి లంకారాజ్య పట్టాభిషేకం చేశాడు. తదియ నాడు లంకనుంచి బయలుదేరి చతుర్థి నాడు భరద్వాజ మహాముని ఆశ్రమానికి విచ్చేశారు. చైత్ర శుద్ధ పంచమినాడు జగదానందకరంగా, అంగరంగ వైభోగంగా అయోధ్యలో పట్టాభిషిక్తుడయ్యాడు.

బ్రహ్మదేవుడు పరాశక్తిని శారద రూపంలో దర్శించి, ఆరాధించి ఆమె దయచేత సృష్టిని రచించగలిగే సృజనాత్మకతను పొందాడంటారు. యాజ్ఞవల్క్యుడు

గీర్వాణి కృపవలన శాపవిముక్తుడై స్మృతిశక్తిని సంపాదించుకొని విద్వాంసుడయ్యాడని పురాణం చెబుతోంది. వాల్మీకి సరస్వతీ ఉపాసన వలన మహాకావ్యరచన చేసినట్లు, అదే రీతిలో శారద దీక్షను స్వీకరించిన వ్యాసదేవుడు వేదవిభజన చేసి పురాణ విద్యను ఆవిష్కరించి ఆచార్యుడయ్యాడు. ఆదిశంకరులు శారదానుగ్రహం వల్లనే సద్బుద్ధితో ఎదగగలమని చాటుతూ పావన శృంగగిరి (శృంగేరి) క్షేత్రంలో శారదామాతను ప్రతిష్టించారు

ఆంధ్రప్రదేశ్ లోని ఆదిలాబాద్ జిల్లా గోదావరీ తీరాన బాసరలో ఈ మాఘశుద్ధ పంచమినాడు శారదాదేవి జన్మదినోత్సవం మహావైభవంగా జరుగుతుంది. ఈ క్షేత్రాన వెలసిన అమ్మ వాసరా సరస్వతి వేదవ్యాసులవారు అక్కడే తపస్సు చేసి అమ్మవారి సాక్షాత్కారం పొంది వేదవిభజన, పురాణ, భారత రచనాశక్తి పొందారంటారు.

మన రాష్ట్రంలోని బాసర క్షేత్ర పవిత్ర గోదావరీ నదీ తీరాన ఆదిలాబాద్ జిల్లా ముధోల్ మండలంలో నిజామాబాద్ కి 30 కి మీ దూరంలో ఉంది. మహాభారత యుద్ధానంతరం, వేదవ్యాస మహర్షి, దక్షిణాది తీర్థాటనంలో నాటి దండకారణ్య ప్రాంతమైన కుమారచల ప్రాంతంపై ఆశ్రమ నివాసం ఏర్పరచుకున్నాడు. తపస్సంపన్నుడైన వ్యాసుడు ప్రతి రోజు గోదావరిలో పవిత్ర స్నానానంతరం, దోసిలితో ఇసుక తెచ్చి మూడు మూర్తులను ప్రతిష్టించారని స్థలపురాణం చెబుతోంది. వారే శ్రీ మహాసరస్వతి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాకాళికలు.



గర్భాలయంలో కొలువుతీరి ఉన్న (శ్రీలక్ష్మీ సహిత) శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు సర్వాలంకార భూషితయై, పుష్పాలంకార కృతయై, హరిద్రావర్ణంతో, వీణాపాణియైజ్ఞాన కాంతులను వెదజల్లుతూ దర్శనమిస్తుంటుంది. ఆ తల్లిని దర్శించుకుని పూజలు గావించినవారికి అపార జ్ఞానం సిద్ధిస్తుంది. మంత్రకవచాన్ని పఠిస్తూ పూజాదులను నిర్వహించినవారికి సకలశుభాలను అనుగ్రహిస్తుంది. ఈ ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు అభిషేకం, అష్టోత్తర కుంకుమార్చన, అక్షరాభ్యాసం, ఒడి బియ్యం, ఉపనయనం, దేవికి చీర సమర్పణ, పల్లకి సేవ, వాహనపూజలు జరుగుతుంటాయి.

ఈ క్షేత్రంలో అమ్మవారి ముందు పిల్లలకు అక్షరాభ్యాసం చేయిస్తే, పిల్లలు బాగా చదువుతారని భక్తజన విశ్వాసం. ఈ పూజలో భాగంగా అమ్మవారికి పలక, బలపాలను కానుకలుగా సమర్పిస్తుంటారు. ఈ శ్రీపంచమినాడు తెల్లని పుష్పాలను దేవికి సమర్పిస్తూ, పరమాన్నం, చెరుకులు, నేతివంటలు, కొబ్బరికాయ, అరటిపళ్ళు, తెలుపు వస్త్రాలను, తెలుపు చందనాన్ని అమ్మవారికి నివేదన చేసినవారికి పిల్లలు విద్యలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులవుతారు. అంతగా చదువులో రాణించని పిల్లలు ఈ క్షేత్రంలో ఒక రాత్రి బస చేస్తే, ఉతమ శ్రేణి విద్యార్థినీ విద్యార్థులుగామారుతారన్నది భక్తుల నమ్మిక. అమ్మవారి సన్నిధిలో పిల్లలచేత సరస్వతీ కవచాన్ని జపింపజేస్తే, ఆ పిల్లలు అద్భుత జ్ఞాన సంపదను పొందుతారు. ఇది కాక అమ్మవారికి పూసిన పసుపు అర్చకుని ద్వారా స్వీకరించితే చాలు, అపార జ్ఞానం సొంతమవుతుంది.

ఓం సరస్వతీ మాతయే నమః

శ్రీ పంచమి 9 ఫిబ్రవరి 2019 రోజున.

## గ్రహణం పట్టిన మనిషి

( 38వ పేజీ తరువాయి)

నమ్మకం మాది. అతనింతటి నీచానికి ఒడగట్టడమే కాకుండా, పైవాళ్లని ఇరికించే ప్రయత్నం చేయడం చాలా ఆశ్చర్యకరం!" అన్నాడు మూర్తి.

రామేశానికి స్వామి సాక్ష్యం మూలాన ఉద్యోగం పోయింది. వసంతమ్మ చెప్పిన ప్రకారమూ స్వామి తనని గురించి మంచిగానే చెప్పిఉంటాడని రామేశం అనుకొన్నాడు. కానీ వసంతమ్మ, స్వామిని లంచాల దళారిగా నిఘాసంస్థవారు గుర్తించారని లోపాయికారిగా భయపెట్టింది. ఆ మాట సత్యదూరం కాకపోవడంతో స్వామి మాట మార్చాడు. 'నష్టనియంత్రణ నాకు తోచిన విధానంలో చేసేశాను. మీరు నిశ్చింతగా ఉండొచ్చు!' వసంతమ్మ కేంద్రకార్యాలయాధికారికి రహస్య సందేశం పంపించింది.

రామేశం సగటు భారతీయుడిలాగే పోరాడే శక్తి లేక, కర్మసిద్ధాంతపు ముసుగులో దూరిపోయి, పలుతెరల చలనచిత్ర సముదాయంలో ఓ చిన్న ఉద్యోగంలో చేరాడు. ఒక్కోతెరమీద ఒక్కోరకమైన సమాజ చిత్ర ప్రదర్శన జరుగుతోన్నా రామేశం బ్రతుకు గేటు దగ్గరే! గ్రహణంపట్టిన రామేశం జీవితానికి కారణం ఎవరూ అంటే ........?

***


కలం పేరు:ఎలక్ట్రాన్ అసలు పేరు: పింగళి వెంకట రమణ రావు, మొబైల్: 99496 94386
చిరునామా:
పి.వి.రమణ రావు,
2-7-607, ఎక్సైజ్ కాలనీ,
సుబేదారీ,
పోస్ట్:హనమకొండ-506001 ,
తెలంగాణ.

సుపథ

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరులో

## 'ప్రొఫెసర్ వి.వి.యస్. శర్మ మెమోరియల్ లెక్చర్' సిరీస్ ప్రారంభం

- డా॥ వల్లూరి విజయ హనుమంతరావు
తాడేపల్లిగూడెం



**ఆచార్య వల్లూరి విశ్వేశ్వర సుబ్రహ్మణ్యశర్మగారు** (ప్రొఫెసర్ వి.వి.యస్.శర్మ) 'సుపథ' పాఠకులకు సుపరిచితులు. దాదాపు పత్రిక పెట్టిననాటినుండి, ఈ రెండుదశాబ్దాల కాలంలో వారు అనేక అపురూపమైన, విశేషమైన వ్యాసాలు(ఆంగ్లంలోనూ, తెలుగులోనూకూడా) 'సుపథ'లో వ్రాసారు. 'సుపథ'కు ఉత్తమస్థాయిని కల్గించడంలో వారి రచనల పాత్ర ఎంతోఉంది. భారతదేశంలో సాంకేతిక విద్యకు అత్యున్నత వేదిక అయిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (I.I.Sc.), బెంగళూరుతో 5 దశాబ్దాల సుదీర్ఘమైన అనుబంధంకలిగిన శర్మగారి వ్యక్తిత్వం, భారతీయ ప్రాచీన – నవీన విజ్ఞానాల మేలుకలయిక. వారు ఈ సంవత్సరం జనవరిలో (13-01-2018) తనువు చాలించారు. వారి స్ఫూర్తిదాయకమైన స్మృతిని శాశ్వతంగా నిలిపే ఉద్దేశ్యంతో వారి శిష్యులు, సహోద్యోగులు కొందరు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, బెంగళూరు లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఆటోమేషన్ విభాగంలో, **'ప్రొఫెసర్ వి.వి.యస్.శర్మ మెమోరియల్ లెక్చర్' సిరీస్** పేరుతో ఒక స్మారకనిధిని ఏర్పాటు చేసారు. దీనిలోభాగంగా, ప్రతి సంవత్సరం నిపుణుల ఉపన్యాసాలు నిర్వహిస్తారు. ఆచార్య శర్మగారి స్మృతికి అరుదైన గౌరవ చిహ్నంగా ఏర్పాటుచేయబడిన ఈ కార్యక్రమానికి – అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఐదున్నర దశాబ్దాల విశేష బోధనానుభవంగల ప్రొ॥ థామస్ కైలత్, ప్రొఫెసర్ ఎమెరిటస్ గారి ఉపన్యాసం('ఛానెల్ ఐడెంటిఫికేషన్ – ది ఇవల్యూషన్ ఆఫ్ యేన్ ఐడియా') తో ఈ డిసెంబరు 12వ తారీకున శ్రీకారం చుట్టబడింది. స్మారకనిధి ఉపన్యాస ఆవిష్కరణ, నిర్వహణ ప్రొ॥ బి.ఎల్. దీక్షితులుగారి ఆధ్వర్యంలో, ఐ.ఐ.ఎస్‌సి. డైరెక్టర్ ప్రొ॥ అనురాగ్ కుమార్ గారి అధ్యక్షతన జరిగింది.

ఈ కార్యక్రమంలో అనేకమంది ఆచార్య శర్మగారి పూర్వ విద్యార్థులు, సహోద్యోగులు, శర్మగారితో తమకుగల అనుభవాలను, తాము వారి నుండి పొందిన స్ఫూర్తిని పంచుకున్నారు.



చైతన్యం

# జనార్ధన ఠాకూర్



## రాశి ఫలాలు

ఫిబ్రవరి నెలలో: రవి మాసారంభంలో మకరరాశిలో, తదుపరి 13 వ తేదీన కుంభ రాశిలో ప్రవేశం; కుజుడు ఫిబ్రవరి 5 నుండి మేషరాశిలో సంచారం; బుధుడు 7 నుండి కుంభరాశిలో, 25 నుండి మీనరాశిలో సంచారం; శుక్రుడు 24 వరకు ధనస్సు తదుపరి మకరరాశిలో; గురువు వృశ్చికరాశి లో సంచారం; శని ధనస్సులో సంచారం; రాహువు కర్కాటకంలో; కేతువు మకరంలో సంచారం

**మేష రాశి**: ఈమాసంలో ఆర్థికంగా సామాన్యంగా వుంటుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. బంధుమిత్రుల సహకారాలు వుంటాయి. ఉద్యోగస్తులకు సామాన్య సమయం. వ్యాపారస్తులకు సామాన్యంగా ఉండును. విద్యార్థులు శ్రద్ధ వహించాలి. ఉన్నత విద్య అవకాశాలు బాగా ఉన్నాయి. 25-27 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోండి. వైదిక సూచన: 1. దుర్గ ఆరాధన

**వృషభరాశి**: ఈమాసంలో ఆర్థికంగా అనుకూలంగా వుంటుంది. ఆరోగ్య విషయంలో ముందు జాగ్రత్త అవసరం. దీర్ఘకాలంగా జరగని పనులు ఇప్పుడు ఒక కొలిక్కి వచ్చి ఫలించు సమయం. స్థాన చలన సూచన కలదు. బంధుమిత్రుల సహకారాలు వుండవు. ఉద్యోగస్తులకు అనుకూలసమయం. వ్యాపారస్తులకు సామాన్యంగా ఉండును. 3 వతేదీన, 27-28 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. హనుమాన్ చాలీసా పారాయణ

**మిథున రాశి**: ఈమాసంలో ఆర్థికంగా అనుకూలంగా వుంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. వాహనం నడిపేటప్పుడు జాగ్రత్త వహించవలెను. చెడుసావాసాలనుండి దూరంగా ఉండ వలెను. ఉద్యోగస్తులకు అనుకూలసమయం. వ్యాపారస్తులకు కీర్తిభంగం. విద్యార్థులకు అనుకూలసమయం కాదు. దీర్ఘకాలంగా జరగని పనులు ఇప్పుడు ఒక కొలిక్కి వచ్చి ఫలించు సమయం. స్థాన చలన సూచన కలదు. ఉద్యోగస్తులకు అనుకూలసమయం. వ్యాపారస్తులకు సామాన్యంగా ఉండును. 4-5 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1.విష్ణుసహస్ర నామ పారాయణ

**కర్కాటక రాశి** : ఈమాసంలో ఖర్చులపై నియంత్రణ లేనిచో ఆర్థిక ఇబ్బందులు తప్పవు. గృహంలో పెద్దవారి ఆరోగ్య విషయంపై శ్రద్ధ వించాలి. మీయొక్క ఆవేశం మరియు కోపం వలన గృహంలో అశాంతి. మీ బుద్ధి మందగించును. స్నేహితులు మరియు బంధువులతో మాటపట్టింపులు వద్దు. కోర్ట్ వ్యవహారంలో చిక్కులు వుడును. ఉద్యోగస్తులకు పై అధికారులవలన చిక్కులు ఉండును. వ్యాపారస్తులకు లాభసాటి కాలం కాదు. పోటీదారులతో చిక్కులు. విద్యార్థులకు, ముఖ్యంగా పరిశోధనా రంగంలో ఉన్నవారికి మంచి సమయం. 5-8 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. నారాయణమంత్ర జపం

**సింహ రాశి**: ఈమాసంలో ఆర్థిక నష్టాల వలన ఆర్థిక సమస్యలు, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలు వుంటాయి. ఇంట్లో పెద్దవారి సలహా తీసుకోవలెను. సంతానం గ్గ్రించి బెంగగా వుంటుంది. కొత్త ప్రణాళికలకు నాంది పలుకుతారు. ఉద్యోగస్తులకు సామాన్యకాలం. లీగల్ విషయాలు త్వరితగతిని పరిష్కరించుకోవలెను. విద్యార్థులు శ్రద్ధ వహించాలి. 8-10 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. 'ఓం ఘ్రుణి సూర్యాయ నమః' మంత్ర జపం ప్రతిరోజూ 11 మార్లు చేయండి.

**కన్యారాశి:** ఈమాసంలో ఆర్థిక విషయాలలో బాగుండును. అభివృద్ధి ఉండును. దీర్ఘకాలంగా బాధపడుతున్నవారికి ఉపశమనం లభించును. శుభకార్యములకు హాజరు అవుతారు. తరచూ ప్రయాణాలు వుంటాయి. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. వ్యాపారస్తులు లాభాలు చవి చూస్తారు. విద్యార్థులు చదువు మీద శ్రద్ధ చూపితే మంచి ఫలితాలు సాధిస్తారు. 10-13 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. శ్రీ గణపతి ఆరాధన

**తులా రాశి:** ఈమాసంలో అధిక ఖర్చుల సూచన మూలంగా జాగ్రత్త వహించవలెను. సహజంగా ఆరోగ్యం బాగున్నా కంటికి సంబంధించిన సమస్యలు వుండును. చిన్న చిన్న కుటుంబ కలహాలు వుండును. దానివలన కొంత చికాకు, మానసిక ఆందోళన ఉండును. స్నేహితులతో మాటపట్టింపు ఉండును. ఉద్యోగస్తులకు కొంత అసౌకర్యంగా ఉండును. వ్యాపారస్తులకు ప్రణాళిక అవసరం. లాభాలు గడిస్తారు. విద్యార్థులకు అనుకూల సమయం. 13-15 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. దుర్గా చాలీసా పారాయణ

**వృశ్చిక రాశి :** ఈమాసంలో ఆర్థిక విషయాలలో ఆచి తూచి వ్యవహరించవలెను. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. ముఖ్యముగా దీర్ఘకాల రోగములతో బాధపడుతున్నవారు జాగ్రత్తగా ఉండవలెను. ఇంటికి దూరంగా కొద్దిరోజులు వుండు అవకాశం కలదు. ఆధ్యాత్మిక ధోరణి అలవరచుకోవలెను. ఉద్యోగస్తులకు అనుకూలసమయం. కొత్త బాధ్యత చేపడతారు. వ్యాపారాభివృద్ధి జరుగును. విద్యార్థులకు గ్రేడ్స్ తగ్గే అవకాశం కలదు. చదువుయందు శ్రద్ధ పెట్టవలెను. 15-17 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ

**ధను రాశి :** ఈమాసంలో ఆర్థిక లావాదేవీల లో శ్రద్ధ చూపవలెను. ఆరోగ్యసమస్యలు ఉండ వు కానీ ఎలర్జీ వలన కొంత సతమతమవుదురు. ప్రతి పని యందు ఓర్పు అవసరం. గృహంలో కలహము ల వలన మనః శాంతి లోపించు ను. ఉద్యోగస్తులకు అనుకూలం. స్థిరాస్థి విషయంలో అభివృద్ధి. వ్యాపారస్థులు లావాదేవీలలో జాగ్రత్త వహించవలెను. విద్యార్థులు గురు వుల సలహాలు తీసుకోవలెను. 17-18 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. అష్టాక్షరీ మంత్ర జపం

**మకర రాశి:** ఈమాసంలో ఆర్థికముగా స్థిరత్వము కల్గిన స్పెక్యులేషన్ ద్వారా ధననష్టం పొందు అవకాశం కలదు. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆహార నియమములు పాటించండి. కుటుంబంపై శ్రద్ధ వహించండి. ఉద్యోగస్తులకు సామాన్యంగా ఉండును. సహచరులతో జాగ్రత్తగా మెలగావలెను. వ్యాపారస్తులకు అనుకూల సమయం. విద్యార్థులకు కూడా అనుకూల సమయం. 19-21 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. ప్రతి శనివారం నవగ్రహ ప్రదక్షిణ చేయండి.

**కుంభ రాశి:** ఈమాసంలో ఆర్థికముగా అనుకూల స్థితి. ఆరోగ్యం బాగుంటుంది. గృహ వాతావరణం మీ ప్రవర్తన పై ఆధారపడియుండును. దగ్గరి బంధువుల సలహాలు స్వీకరించ వద్దు. కోర్ట్ సమస్యలు అనుకూలంగా పరిష్కా రం అవుతాయి. ఉద్యోగస్తులకు సహచరుల సహకారం ఉండదు. దానివలన కొంత చికాకు కలు గును. వ్యాపారస్తులకు అనుకూల సమయం. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ అవసరం. 21-23 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చెయ్యండి.

**మీన రాశి :** ఈమాసంలో ఆర్థికముగా అనుకూల స్థితి. ఖర్చులపై నియంత్రణ అవసరం. జీర్ణ వ్యవస్థ ద్వారా ఆరోగ్య సమస్యలు ఉండును. కుటుంబ సమస్యలు ఉందును. మనస్సు ఆధ్యాత్మిక విషయాలపై మళ్ళించినచో ఉత్తమం. ప్రయాణం లాభదాయకంగా ఉండును. ఉద్యోగంలో తొందరపాటు నిర్ణయాలు తగదు. వ్యాపార విషయంలో అంతర్గత కలహాల వలన సమస్యలు ఉందును. విద్యార్థులకు పై చదువులకు అనువైన కాలం. 23-25 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. రావి చెట్టు చుట్టూ ప్రదక్షిణ నియమంగా చేయండి.



శ్రీ కె సి ఆర్ దంపతులు చండీయాగం నిర్వహణ



శ్రీ చంద్రబాబు నాయుడు - మొదటి కియా కారు విడుదల

RNI No. APTEL/2011/39497 FBRUARY 2019 Postal No. HSE/1043/2017-19

Date of Publishing: 1st February Date of Posting: 8th February



Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-500001